



హుండీ డబ్బును లెక్కిస్తున్న టీటీడీ సిబ్బంది

బదిలీ అయినట్టా? కానట్టా?

- అమలులోకి రాని వీఆర్వోల బదిలీల ప్రక్రియ
- రాజకీయ నేతల సిఫార్సులు బేఖాతర్
- బదిలీ అయినా రిలీవ్ చేయని తహసీల్దార్లు
- రిలీవ్ అయిన వీఆర్వోలు గాల్లో...
- అయిన వారూ ఎక్కడికక్కడే...



మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం

మదనపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల జరిగిన వీఆర్వోల బదిలీలపై సందిగ్ధత నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలో జరుగుతున్న బదిలీల ప్రక్రియలో ఇది మూడోది. పాలనా వ్యవహారాల్లో రాజకీయ ప్రవేశాన్ని జిల్లా అధికారులు పెద్దగా పట్టించుకోలేదని స్పష్టమవుతోంది. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో కీలకమైన వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకూ వీరి నియామకాలు, బదిలీలలో అటు ప్రజాప్రతినిధులు, ఇటు జిల్లా ఉన్నతాధికారుల మధ్య అంతర్యుద్ధం సాగుతోంది. ఇప్పటి వరకు మూడుసార్లు జరిగిన బదిలీలలోనూ ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. తాజా బదిలీల నాటికి ఆ వివాదం ముదిరి పాకాన పడినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, కూటమి నేతల సిఫార్సులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదని చెబుతున్నారు. ఇందులో భాగంగా తమ సిఫార్సులను పరిగణలోకి తీసుకోనప్పుడు, మీరు తీసుకున్న నిర్ణయాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామనే సంకేతాలిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో గ్రేడ్-1, గ్రేడ్-2 విభాగాలకు చెందిన 79 మంది వీఆర్వోలను బదిలీ చేస్తూ జారీ చేసిన జాబితా ఇప్పటికీ అమలులోకి రాలేదు. ఎన్నడూ లేని విధంగా, ఎక్కడా జరగని విధంగా ఇక్కడ మాత్రమే వీఆర్వోల బదిలీల ప్రక్రియ సుమారు మూడు నెలలు కొనసాగింది. అది ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాకపోవడం వీఆర్వోలను ఆందోళనకు గురి చేస్తోంది.

జిల్లాలో గ్రేడ్-1లో 45 మంది వీఆర్వోలు, గ్రేడ్-2లో 34 వీఆర్వోలను ఇటీవల బదిలీ చేశారు. ఇందులో ఎక్కువగా జిల్లా కేంద్రం రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఏరియాలలో ఉన్నారు. అయితే బదిలీలు చేసినా తర్వాత ఆ జాబితా క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. ఎందుకు కాలేదని అటు జిల్లా అధికారులు, ఇటు రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారులకూ తెలుసు. సాధారణంగా ఉద్యోగి ఒకచోట నుంచి మరోచోటికి బదిలీ కాగానే, రెండు మూడు రోజుల్లో ఆయా తహసీల్దార్లు రిలీవ్ చేయాలి. ఆ వెంటనే వారు బదిలీ అయిన స్టేషన్‌లో విధుల్లో చేరిపోవాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. ఎక్కడి వారు అక్కడే ఉన్నారు. అసలు మేం బదిలీ అయినట్లా? కానట్లా? అనే సందిగ్ధం వారిలో నెలకొంది. ఈ అంశంపై వీఆర్వోలు ఎక్కడికక్కడ తహసీల్దార్లను ప్రశ్నిస్తున్నారు. అయితే..చూద్దాం, చేద్దాం..అంటూ ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే జిల్లా రెవెన్యూ అధికారి కూడా బదిలీ అయిన వీఆర్వోలను వెంటనే రిలీవ్ చేయాలని తహసీల్దార్లను ఆదేశించామని, లేకుంటే చర్యలు తీసుకుంటామని వారికి సూచించినట్లు చెప్పడం కూడా ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఇక్కడి ప్రజాప్రతినిధులు, కూటమి నేతల మాటలు, సిఫార్సులు జిల్లా స్థాయిలో, ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ శాఖలో ఏమాత్రం చెల్లుబాటు కావడం లేదు. పెద్ద పెద్ద ఉద్యోగాలను పక్కన పెడితే వీఆర్వోల నియామకాలు, బదిలీలు..అలాగే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలోనూ చెల్లని కాసులయ్యాయి. ఫలితంగా ఆ ప్రభావం మొన్నటికి మొన్న జరిగిన తహసీల్దార్లు, తాజాగా జరిగిన వీఆర్వోల బదిలీపై పడింది. చివరకు ఉద్యోగులే బాధితులుగా మారారు. ఇదిలా ఉండగా మదనపల్లె నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధి మాట, సిఫార్సు జీరో అనే చెప్పాలి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయన సిఫార్సు లేఖలు ఇవ్వడం పూర్తిగా మానేశారు. ఇచ్చినా పనిచేయవని తెలుసుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో బదిలీ అయిన వీఆర్వోలను రిలీవ్ చేయకపోగా బదిలీపై వచ్చిన వారిని చేర్చుకోలేదు. అదే మదనపల్లెలో 18 మంది వీఆర్వోలు బదిలీ కాగా ఇక్కడి తహసీల్దార్ వెంటనే 14 మందిని రిలీవ్ చేసేశారు. మరో నలుగురిని అలాగే పెట్టారు. ఇదేమంటే అడిగిన వారిని రిలీవ్ చేశానని, జిల్లా అధికారులు వద్దన్న వారిని అలానే పెట్టానని చెబుతున్నారు. ఇదిలా ఉండగా రిలీవ్ అయిన 14 మంది వీఆర్వోలలో పీలేరు నియోజకవర్గానికి బదిలీ అయిన వారిలో ఇద్దరిని రిలీవ్ చేశారు. కానీ వీరిని అక్కడ అధికారులు చేర్చుకోలేదు. మరోవైపు పీలేరు నుంచి ఇతర మండలాలకు బదిలీ అయిన వీఆర్వోలనూ రిలీవ్ చేయలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ రెండిండితో పోలిస్తే మదనపల్లెలో పరిస్థితి మరింత భిన్నంగా ఉంది.

ఇటీవల బదిలీ అయిన వీఆర్వోలలో మదనపల్లె పట్టణం, మండలంలో సొంత గ్రామం, సొంత మండలంలో 16 మంది ఉన్నారు. అలాగే మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో మొత్తం 27 మంది ఉన్నారు.



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం

ఎందుకీ పరిస్థితి?

జిల్లాలో ఇప్పటి వరకూ జరిగిన వీఆర్వోల బదిలీలలో ప్రజాప్రతినిధులు, కూటమి నేతలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని చెబుతున్నారు. ఇందులో భాగంగా తాము చెప్పిన వారిని నియమించాలని, తాము సూచించిన వారిని బదిలీ చేయాలని.. ఆయా ఉద్యోగులు, వీఆర్వోలకు అధికారులకు సిఫార్సు లేఖలు ఇచ్చారు. వీటిని ఏమాత్రం పట్టించుకోలేదని తెలుస్తోంది. పైగా ఆయా మండలాల్లో ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జ్‌లకు దగ్గరగా, అనుకూలంగా ఉన్నారంటూ వారిని మరోచోటికి బదిలీ చేసేశారు. అదే వారి ఆగ్రహానికి కారణమైంది. మా మాటలు, లేఖలకు విలువ ఇవ్వకపోగా మా మనుషులను మరో చోటికి మార్చేస్తారా? అంటూ ఆగ్రహంతో ఉన్నారు. అదే ప్రస్తుతం బదిలీ అయిన వీఆర్వోల జాబితా అమలులో సందిగ్ధానికి కారణమైంది. ఇదే పరిస్థితి కొనసాగితే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి తాడోపేడో తేల్చుకోవాలనే ఆలోచనలో ఆ ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జ్‌లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగా ఇటీవల పీలేరు నియోజకవర్గంలో జిల్లా అధికారిపై ప్రభుత్వం నుంచి ఐవీఆర్‌ఎస్ ఫోన్‌కాల్స్ రాగా, చాలామంది వ్యతిరేకంగా చెప్పినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆ అధికారి అప్పటి నుంచి కాస్త మెత్తబడినట్లు కూడా రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. జిల్లా కేంద్రం నుంచి గ్రామ స్థాయి వరకు ఈ మూడు నియోజకవర్గాల్లో తమకు కావాల్సిన అధికారులు, వీఆర్వోలను నియమించుకున్నట్లు తెలుస్తోంది. ఇలా వీఆర్వో, సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ వరకూ ఉన్నట్లు చెబుతున్నారు. తమకు కావాల్సిన వారితో కావాల్సిన పనులు చక్కపెడుతున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె, కురబలకోట మండలం అంగళ్లు, ముదివేడులలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక్కడ భూమార్పిడికి రిపోర్టులు, ఎన్‌వోసీలు, 22ఏలు కీలకంగా మారాయి. ఇలాంటి పనులన్నీ చకచకా సాగిపోతున్నాయి. మదనపల్లె ఏరియాలో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు ఇటీవల క్లియర్ చేస్తున్నారు. ఎన్‌వోసీలు జారీ చేస్తున్నారు. రికార్డులను బిల్డప్ చేయడం నుంచి మార్పు చేయడంలో ఆది నుంచీ ఆరితేరిన కొందరు ఉద్యోగులను తెచ్చుకుని పని కానిచ్చేస్తున్నారు. ఇందులో భాగంగా పీలేరు ప్రాంతం నుంచి మదనపల్లెకు వచ్చిన ఓ అధికారి మదనపల్లెలో ఇటీవల రూ.కోటిన్నర విలువ చేసే భవనం కొనడం రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

ఈ విషయమై డీఆర్వో వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

హుండీ ద్వారా రూ.10 లక్షల ఆదాయం

ఒంటిమిట్ట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామునికి హుండీ ద్వారా రూ.10,23,681 ఆదాయం లభించింది. సోమవారం కోదండరామాలయంలోని హుండీలను టీటీడీ అధికారులు లెక్కించారు. నెలకు సంబంధించిన కోదండరామునికి హుండీ ద్వారా ఈ ఆదాయం దక్కింది. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని యూనియన్ బ్యాంకులో జమ చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీదారుల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాల ని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యం కల్పించారు. పీలేరు టౌన్ పరిధిలోని బాలాజీనగర్ అజంతా వీధికి చెందిన ఎస్.బాషాసాహెబ్ తనకు రెండు చెవులు వినపడవని, తనకు వినికిడి యంత్రాన్ని, వికలాంగుల పించన్ ఇప్పించాలని కోరారు. వాల్మీకిపురానికి చెందిన హెచ్.రామచంద్ర తనకు కలికిరి మండలం గుండ్లూరులో ఖాతా నెంబర్ 1655లో 1484/1ఏలో ఒక ఎకరా భూమి ఉందని, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం డబ్బులు వాల్మీకిపురం మండలం మంచూరు గ్రామస్తులైన రామేశ్వరస్వామి అకౌంట్‌లో జమ అవుతున్నాయని, డబ్బులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంత్రి ప్రజాదర్బార్



ప్రజల సమస్యలను వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో సోమవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని విద్యుత్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

ములకలచెరువు 6
మార్కెట్టే టాప్...! రికార్డు స్థాయిలో టమోటా విక్రయాలు

జిల్లాలో 11 బార్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈనెల 26 వరకు గడువు
- 28న లాటరీ పద్ధతిలో ఎంపిక
- ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ మధుసూదన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈఎస్ మధుసూదన్

రాయచోటిటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 11 మద్యం బార్‌లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆసక్తి గల వారు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. సోమవారం ఆయన ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో రాయచోటి ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

ప్రతి బార్‌కు 4 దరఖాస్తులకు పైబడి ఉంటే లాటరీ తీస్తామని, 4 కంటే తక్కువ దరఖాస్తులు ఉంటే ఆ బార్ ఎంపికను తాత్కాలికంగా నిలిపివేస్తామని తెలిపారు. మదనపల్లి మున్సిపాలిటీలో-5, రాయచోటి మున్సిపాలిటీలో 3, రాజంపేట మున్సిపాలిటీ-2, పీలేరు టూరిజం సెంటర్‌లో ఒకటి చొప్పున మొత్తం జిల్లా వ్యాప్తంగా 11 మద్యం బార్ షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ సాయంత్రంలోపు ఆన్‌లైన్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఈనెల 28న కలెక్టరేట్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు దరఖాస్తుదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రతి బార్‌కు రూ.5 లక్షలు అప్లికేషన్ ఫీజుతో పాటు రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వరన్నారు. తక్కువ జనాభా ఉన్న పీలేరుకు రూ.35 లక్షలు, ఎక్కువ జనాభా ఉన్న మదనపల్లె, రాయచోటి, రాజంపేటలకు రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గతంలో మొత్తం డబ్బును ముందే కట్టేవారని, ప్రస్తుతం విడతల వారీగా 6 విడతల్లో కట్టవచ్చని తెలిపారు. గతంలో కన్నా అదనంగా 3 గంటలు పెట్టుకునే అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

దళారులపై చర్యలు తీసుకోండి

- బొప్పాయి రైతులకు న్యాయం చేయాలి
- సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలో రైతు సంఘం నేతలు

రాజంపేట టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి రైతులను దళారులు దగా చేస్తున్నారని, వ్యాపారులతో కలెక్టర్ సమావేశమై కనీస ధర నిర్ణయించినప్పటికీ అమలు చేయడం లేదని దళారులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు సంఘం నేతలతో కలిసి సీఐటీయూ, సీపీఐ నేతలు నిరసన తెలియజేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ భావనకు రైతులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరులో బొప్పాయి రైతులు నెల రోజులుగా గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనెల 1వ తేదీ రైతులు, వ్యాపారులు, మార్వాడీలతో కలెక్టర్ సమావేశమై కనీస ధర 9 రూపాయలు, 6వ తేదీ నుంచి పది రూపాయలు అమలు చేయాలని నిర్ణయించారు. కొన్నిరోజులు 9 రూపాయలు కనీస ధర ఇస్తున్న వ్యాపారులు ఒక్కసారిగా ఏడు రూపాయలుగా నిర్ణయించారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని బొప్పాయి ధర రూ.15 తగ్గకుండా కొనుగోలు చేయాలని వారు కోరారు. అధికారులతో సమావేశమై చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు మణి, ఆదినారాయణ, శివకృష్ణచౌదరి, ఈశ్వరయ్య, వెంకటరత్నం, సుబ్బరాజు, కె.బాల, వి.హరిబాబు, శివకుమార్‌వర్మ పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్, జగన్‌మోహన్‌రాజు
- పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల



ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, చమర్తి జగన్‌మోహన్‌రాజు, లక్ష్మీప్రసాద్‌రెడ్డి

సుండుపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని విధాలా మేలు చేకూర్చేలా ప్రభుత్వం అండగా ఉంటోందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డిలు పింఛా ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు నిండడం సంతోషదాయకమన్నారు. ప్రాజెక్టు దిగువ భాగంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 0.327 ఎఫ్‌టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి చేరిందన్నారు. ఒక గేటు ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశామన్నారు. అలాగే కుడికాలువకు 20 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 25 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. కాలువల ద్వారా విడుదల చేసిన నీటితో కుంటలు, చెరువులు నింపాలన్నారు. ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి కావడం సకాలంలో గత ఏడాది, ఈ ఏడాది వర్షాలు కురవడం ప్రాజెక్టులోకి నీరు రావడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. మట్టి కట్ట తెగిపోయినప్పుడు కుడికాలువ ఒక ఇరువైపులా ఉన్న పల్లెలకు వెళ్లేందుకు రహదారి కూడా కొట్టుకుపోయిందని, మట్టి కట్ట పనులు పూర్తయిపోయినా కూడా రహదారి ఏర్పాటు చేయలేదని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, స్థానిక గ్రామాల ప్రజలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రహదారి ఏర్పాటు చేసేలా చేస్తామని స్థానికులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంతో పింఛా ప్రాజెక్టుకు మహర్దశ వచ్చిందని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆగిపోయిన ప్రాజెక్టు పనులను సుమారు రూ.74 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట్రామయ్య, డీఈ చంగల్‌రాయుడు, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ఏపీవో మాలిక్‌బాషా, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



విడుదలవుతున్న నీరు

విధులకు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు....

● ముదివేడు క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం..

● కంటైనర్-ద్విచక్రవాహనం ఢీకొని హోంగార్డు మృతి



మృతి చెందిన హోంగార్డు ఈశ్వర్‌నాయక్

కురబలకోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కడప-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిపై ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం కోటకొండ తండా వాసి ఈశ్వర్‌నాయక్ హోంగార్డుగా పనిచేస్తున్నాడు. కాగా ఆయన మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాత్రి వేళ విధులకు కోసం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యలోని ముదివేడు క్రాస్ మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న కంటైన ర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న ఈశ్వర్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ చేరుకుని విచారించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడి కుటుంబీకుల రోదనలు ఆస్పత్రిలో మిన్నంటాయి. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు ముదివేడు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పశుసంవర్ధకశాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



పి.లలిత, వి.ఎస్.కె. మైనుద్దీన్

పీలేరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తమ శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగుల ఉత్తమ పనితీరుకు ప్రశంసాపత్రాలు లభించినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై సోమవారం తెలిపారు. పీలేరులోని నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ల్యాబ్ టెక్నీషియన్ పి.లలిత, మదనపల్లెలోని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ వి.ఎస్.కె. మైనుద్దీన్‌కు ఏటా స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అందించే ప్రశంసా పత్రాలకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. వారిద్దరికీ ఈ నెల 20వ తేదీన విజయవాడలోని తమ శాఖ ప్రధాన కార్యాల యంలో జరిగే కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందిస్తారని తెలి పారు. పీలేరులో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పి.లలిత, తన పనితీరు కారణంగా అనేక పశువ్యాధుల చికిత్సలో వైద్యులకు సహాయ కారిగా ఉంటున్నారన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి వారిద్దరూ ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కన్నెమడుగు విద్యార్థిని



విద్యార్థిని సంధ్య

తంబళ్లపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన టి.సంధ్య జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌భాష తెలిపారు. అన్నమయ్య జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ సురేష్ బాబు, జిల్లా కార్యదర్శి గౌతం, ఏపీ షూటింగ్ బాల్ కార్య దర్శి పరశురాముడు నుంచి ఎంపిక ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 25, 26 తేదీల్లో వశిష్ట ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సంధ్య జిల్లా తరుపున పాల్గొని సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. 22, 23, 24 బీహార్ రాష్ట్రం బుద్ధ గయలో జరిగే 44వ జాతీయ స్థాయి పోటీల్లో సంధ్య పాల్గొంటుంద న్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సంధ్యను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం మదన్‌మోహన్, పీడీ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రాజంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. రాజంపేట ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పించా డ్యాం నిండినందున కలెక్టర్ ఆధ్వర్యంలో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ నేపథ్యంలో చెయ్యేరు నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మన్నారు పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు బాలరాజుపల్లె వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వరదనీరు ఎక్కువగా వస్తున్నందున ఎవరూ చెయ్యేరు నదిలోకి వెళ్లరాదని, రాజంపేట, నందలూరు, పెనగలూరు, చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ములకలచెరువు మార్కెట్టే టాప్...!

● రికార్డు స్థాయిలో టమోటా క్రయ విక్రయాలు... ఎగుమతులు

● మదనపల్లెను మళ్లీ వెనక్కి నెట్టిన వైనం

● మార్కెట్‌కు పోటెత్తుతున్న టమోటాలు

● మార్కెట్‌కు రూ.కోట్లలో ఆదాయం

● రైతులకు గుక్కెడు నీరు... కనీస వసతులు కరువు



ములకలచెరువు మార్కెట్‌కు భారీగా అమ్మకానికి వచ్చిన టమోటాలు

ములకలచెరువు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): టమోటా క్రయ విక్రయాలు...ఎగుమతుల్లో టాప్‌గా ములకలచెరువు టమోటా మార్కెట్ నిలిచింది. ఆసియాలోనే నెంబర్ వన్ మార్కెటైన మదనపల్లెను మళ్లీ వెనక్కి నెట్టింది. ఇంకా సీజనే ప్రారంభం కాలేదు...అప్పుడే మార్కెట్‌కు టమోటాలు పోటెత్తుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో సీజన్ ప్రారంభమవుతుంది. టమోటాలు మరింతగా అమ్మకానికి వస్తాయి....టమోటా మార్కెట్ కళకళలాడుతోంది. అత్యధికంగా రైతులు పండించిన టమోటాలను ఇక్కడికే అమ్మకానికి తెస్తున్నారు. మార్కెట్‌కు రూ.కోట్లలో ఆదాయం...అయినా ఇక్కడ రైతులకు గుక్కెడు నీరు, కనీస వసతులు కరువయ్యాయి. ఏళ్ల తరబడిగా రైతుల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు.

తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి వ్యవసాయ మార్కెట్ ములకలచెరువులో ఉంది. దీనికి 1977లో ప్రారంభించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలతో పాటు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలలోని పలు గ్రామాల రైతులు టమోటాలను విక్రయించేందుకు ఇక్కడికి తీసుకొస్తారు. ప్రతిరోజూ వందలాది మంది రైతులు మార్కెట్‌కు వస్తుంటారు. సీజన్‌లో అయితే రైతుల సంఖ్య రెట్టింపుగా ఉంటుంది.



పిల్లర్లకే పరిమితమైన వాణిజ్యగదుల నిర్మాణం

టాప్ ప్లేస్‌లోకి ములకలచెరువు మార్కెట్

ములకలచెరువు టమోటా మార్కెట్ టాప్ ప్లేస్‌లోకి వచ్చింది. టమోటా క్రయ విక్రయాలు, ఎగుమతుల్లో ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌ను ములకలచెరువు మళ్లీ వెనక్కి నెట్టింది. 20 రోజులుగా మదనపల్లె కంటే ములకలచెరువు వ్యవసాయం మార్కెట్‌కు అత్యధికంగా టమోటాలు అత్యధికంగా వస్తున్నాయి. క్రయవిక్రయాలతో పాటు ఇతర రాష్ట్రాలకు అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. సాయంత్రం మార్కెట్ కావడంతో రైతులకు ఎంతో అనుకూలంగా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌కు టమోటాలు పోటెత్తుతున్నాయి. ప్రతిరోజూ 300 నుంచి 500 మెట్రిక్ టన్నుల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. మదనపల్లెలో కేవలం 140 నుంచి 300 మెట్రిక్ టన్నులు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. దీనిని బట్టి చూస్తే ములకలచెరువు మార్కెట్ టాప్ ప్లేస్‌లో ఉంది. గత ఏడాది సీజన్‌లో కూడా ములకలచెరువు మార్కెట్‌లో మదనపల్లె మార్కెట్ కంటే అత్యధికంగా టమోటా క్రయవిక్రయాలు, ఎగుమతులు అయ్యాయి. తాజాగా మళ్లీ సీజన్ ప్రారంభం కాక ముందే మదనపల్లెను వెనక్కి నెట్టి మొదటి స్థానానికి చేరింది. సీజన్‌లో మరింతగా క్రయవిక్రయాలు, ఎగుమతులు జరగనున్నాయి. అలాగే మార్కెట్ కమిటీ ఆదాయం లక్ష్యాన్ని మించి వస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి లక్ష్యం కాగా రూ.1.10 కోట్లు, 2023-24లో రూ.1.10 కోట్లు లక్ష్యం కాగా రూ.1.12 కోట్లు, 2024-25లో రూ.1.24 కోట్లు లక్ష్యం కాగా 1.32 కోట్లు ఆదాయం వచ్చింది. టమోటాలు ఎగుమతి చేసే వాహనాలకు విధించే సెస్సుల ద్వారా ఈ ఆదాయం సమకూరుతోంది.

వైసీపీ పాపం....రైతులకు శాపం

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ములకలచెరువు మార్కెట్ కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ప్రభుత్వానికి ములకలచెరువు మార్కెట్ ద్వారా రూ.కోట్లలో ఆదాయం ఉన్నా రైతులకు మాత్రం కనీస వసతులు కల్పించడంతో విఫలమైంది. రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని ఊదరగొట్టిన వైసీపీ ప్రభుత్వం చేతుల్లో మాత్రం చూపలేదన్నడానికి ములకలచెరువు మార్కెట్టే నిదర్శనం. మార్కెట్‌లో నాలుగేళ్ల పాటు కనీసం తాగునీటి వసతి కల్పించలేదు. మార్కెట్‌లో ఉన్న తాగునీటి వాటర్ ప్లాంటు మరమ్మతులు చేయించడానికి పాలకులకు తీరిక దొరక్కుండా పోయింది. మార్కెట్లలో మండీ యజమానులు తాగునీటి సౌకర్యం కల్పించడంతో ఉపశమనంగా ఉంది. దూరప్రాంతాల నుంచి వస్తున్న రైతులకు విశ్రాంతి తీసుకునేందుకు భవనం నిర్మించలేదు. 2021 అక్టోబరులో మార్కెట్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అప్పట్లో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు అరకొరగా 15 వాణిజ్య గదుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, క్యాంటీన్ నిర్మాణానికి రూ.77 లక్షలు మంజూరు చేశారు. ఇందుల్లో కేవలం వాణిజ్య గదుల నిర్మాణాలను మాత్రం ప్రారంభించి కొంత మేరకు పనులు చేపట్టి వదిలేశారు. మిగిలిన పనులు ప్రారంభించలేదు. దీంతో నిధులన్నీ వెనక్కి వెళ్లాయి. మార్కెట్‌లో కనీస వసతుల కల్పనపై రైతులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్‌లో సీసీ రోడ్డులు వేయాల్సి ఉంది. రైతులకు తాగునీటి వసతి కల్పన, విశ్రాంతి గది నిర్మించాల్సి ఉంది. అలాగే మరుగుదొడ్ల కొరత కూడా తీర్చాల్సి ఉంది.

టమోటా ఎగుమతి అవుతున్న రాష్ట్రాలు...దూరం

ములకలచెరువు మార్కెట్ నుంచి టమోటాలు ఎగుమతి అవుతున్న రాష్ట్రాలు, వాటి దూరం ఇలా ఉంది. ములకలచెరువు నుంచి మహారాష్ట్ర (1000 కిలోమీటర్లు), ఛత్తీస్‌ఘడ్ (1233 కిలోమీటర్లు), కోల్‌కతా (1741 కిలోమీటర్లు), ఝూర్ఖండ్ (1890 కిలో మీటర్లు), ఉత్తరప్రదేశ్ (2038 కిలోమీటర్లు), ఉత్తరాఖండ్ (2388 కిలోమీటర్లు), జమ్ము (2825 కిలోమీటర్లు). ఇక్కడి నుంచి టమోటాలు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి టమోటాలకు బయటి రాష్ట్రాల్లో డిమాండ్ బాగా ఉంది.

మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి



ములకలచెరువు మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నాం. రైతుల విశ్రాంతి భవనం, కమిటీ కార్యాలయం నవీకరణకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపాము. అలాగే ఆగిన వాణిజ్య గదుల నిర్మాణానికి ప్రతిపాదించాం. తాగునీటి వాటర్ ప్లాంట్ మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం. మార్కెట్‌లో విడతల వారీగా సమస్యలన్నంటిని పరిష్కరిస్తాం.

- నవీన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, ములకలచెరువు

వైభవంగా మల్లన్న కుంభాభిషేక మహోత్సవం

● శివనామస్మరణతో మార్మోగిన మల్లయ్యకొండ



మల్లయ్యకొండ పైన వరుణయాగం చేస్తున్న వేద పండితులు

తంబళ్లపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం వరుణయాగం, కుంభాభిషేకం, రాత్రి దీపారాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడి పంటలతో సభిక్షంగా ఉండాలని ఏటా మల్లయ్యకొండపైన కుంభాభిషేకం, వరుణయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆలయ ఈఓ మునిరాజ ఆధ్వర్యంలో వేదపండితులు వెంకట్రమణ, కుమార స్వామి, ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామి కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం 9 గంటలకు నవగ్రహ పూజ, 10:30 నుంచి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ వరుణయాగం హోమం నిర్వహించారు. ఆలయంలోని శివలింగానికి 101 బిందెల నీటితో అభిషేకించి ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుంభాభిషేకాన్ని తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాలు, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు కుటుంబ సమేతంగా అశేషంగా తరలివచ్చారు. భక్తులు చేసే శివనామస్మరణతో మల్లయ్యకొండ మార్మోగింది. కొండ పైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి సౌకర్యం కులగకుండా ఆలయ రికార్డు అసిస్టెంట్ కొండ కిట్ట, సిబ్బంది ఈశ్వర అన్ని ఏర్పాట్లు చేశారు.

కొండపైకి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన స్త్రీ శక్తి పథకం ద్వారా మల్లయ్యకొండ పైకి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. సోమవారం సుమారు 250 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో మల్లయ్యకొండకు ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.. టీడీపీ బీసీ నేత చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ మణి, ఎస్ఎంసీ చైర్మన్ శివకుమార్, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు ఆర్టీసీ సిబ్బందితో కలసి కొండకు వెళ్లే మహిళా భక్తులకు ఉచిత టికెట్ కొట్టారు. మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదుదారులకు బాసటగా నిలవండి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు బాసటగా నిలవడంతో పాటు బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని తెలిపారు.

ముగ్గురు 'రిమ్స్' వైద్యులపై అభియోగాల విచారణకు కొత్త అధికారి

● కార్యాలయం సూపరింటెండెంట్‌పై కూడా

కలికిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కడప 'రిమ్స్' వైద్యులపై నమోదైన అభియోగాలపై విచారణ నిర్వహించేందుకు కొత్త అధికారిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో రిమ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులతో పాటు మరో కార్యాలయం సూపరింటెండెంట్‌పై అభియోగాలు నమోదయ్యాయి. రిమ్స్‌లో పనిచేస్తున్న ఆర్థో విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సురేశ్వరరెడ్డి, అదే విభాగంలోని మరో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.సంజీవయ్య, కంటి విభాగంలో పనిచేసే అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీడీఎల్ సత్యనారాయణ, కార్యాలయం సూపరింటెండెంట్ షేక్ మహబూబ్‌బాషాలపై కొన్ని అక్రమాలకు సంబంధించిన అభియోగాలు నమోద య్యాయి. ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణకు అప్పటి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య 2018లో ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ఈ వ్యవహారం మరుగన పడింది. తాజాగా విచారణ నిర్వహించడానికి తిరుపతి సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభును నియమిస్తూ గత ఏడాది నవంబరు 27న ఆదేశాలు జారీ అయ్యాయి. విచారణ జరుగుతుండగా తనకు ఆరోగ్యం సహకరించలేదనే కారణాలతో విచారణాధికారి తప్పుకున్నారు. తాజాగా ఈ వ్యవహారాన్ని విచారించడానికి విజయవాడ డైరెక్టరేట్ కార్యాలయంలో పనిచేసే వైద్య విద్య అదనపు డైరెక్టరు డాక్టర్ డి.వెంకటేశ్వరరావును నియమిస్తూ ఆరోగ్య వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గత విచారణాధికారి విచారణ జరిపి ఆపి వేసినప్పటి నుంచి విచారణ కొనసాగించాలని ఆదేశించారు.


బంగారు నగలు చోరీ

గాలివీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గాలివీడులోని గౌతమ్ స్కూల్ పక్కన ఉన్న మల్లయ్య ఇంటిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు నగలు దోచుకెళ్లినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. శనివారం బాధితుడు మల్లయ్య సమీప బంధువు పెద్దకర్మకు మాధవరం వెళ్లాడు. విషయం తెలుసుకున్న దొంగలు రాత్రి ఇంట్లోకి ప్రవేశించి పూజ గదిలో ఉన్న 5జతల బంగారు కమ్మలు, మూడు చైన్లు, మూడు ఉంగరాలు తదితరవి తీసుకెళ్లినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ సొమ్ము రూ.17 లక్షలు స్వాహా

● మెప్మా సిబ్బంది నిర్లక్ష్యమేనా.. ?

● పోలీసుస్టేషనుకు చేరిన పంచాయితీ



ప్రొద్దుటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక మహిళా సంఘాలు.. మెప్మా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో గాడి తప్పుతున్నాయి. స్వయం సహాయక మహిళా సంఘాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన ఆర్‌పీలు, సీవోలు, సీఎంఎంలు నెలనెలా సమావేశాలు నిర్వహించి వారి బుక్‌లు పరిశీలించాలి. ఇందువల్ల కొన్ని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో లీడర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ గ్రూపు సభ్యులు లోను కంతులకని ఇచ్చిన సొమ్ము బ్యాంకులో చెల్లించకుండా స్వాహా చేసి చేతులెత్తేయడంతో బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులకు లోను చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో దిక్కు తోచక గ్రూపు సభ్యులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస నగర్‌కు చెందిన నూరె స్వయం సహాయక మహిళా సంఘంలో మొదటి, రెండవ లీడర్లు ఇద్దరు గ్రూపు సభ్యుల లోను కంతులకు అని ఇచ్చిన రూ.17.50 లక్షల సొమ్మును బ్యాంకు లో కట్టకుండా స్వాహా చేశారు.ఈ విషయం గత కొంతకాలంగా మెప్మాసిబ్బందికి తెలిసి మల్లగుల్లాలు పడుతున్నారు. ఇద్దరు లీడర్లు డబ్బులు కడతామని చెపుతూ వాయిదాలు వేస్తూ చివరికి చేతులు ఎత్తేయడం బ్యాంకు అధికారులు లోను డబ్బులు గ్రూపు సభ్యులు కట్టాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇవ్వడంతో గ్రూపు సభ్యులు ఆందోళన చెంది సోమవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. తాము తీసుకున్న రూ20 లక్షల బ్యాంకులోనుకు సంబంధించి కంతులన్ని కట్టామని అయిన 17.50 లక్షలు డబ్బులు బ్యాంకుకు బాకీ వున్నారని నోటీసులు అందడంతో లీడర్లు ఇద్దరి పై చర్యలు తీసుకోని వారి నుండి డబ్బు రికవరీ చేసి తక్కిన ఎనిమిది మంది గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సిఐ సదాశివయ్య ను వివరణ కోరగా డబ్బులు స్వాహా చేసిన లీడర్లు ఇద్దరితో పాటు వారి కుటుంబ సభ్యులను మెప్మా సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● అదుపులో ఐదుగురు నిందితులు

● 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


జమ్మలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీలో తమ సిబ్బంది అయిదుగురు అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టుబడిన అంతర్‌రాష్ట్ర ముఠా గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 10వ తేదీన మధ్యాహ్నం సమయంలో జమ్మలమడుగు ఆర్టీసీ బస్టాండు వద్ద పార్కింగ్ చేసిన ఏపీ04డిఎస్0156 నంబరు గల హోండా ఆక్టివా స్కూటీని చోరీ చేశారని, దాని విలువ రూ.90 వేలు ఉంటుందని బాధితుడు రామమోహన్ ఫిర్యాదు చేశాడు. దీంతో జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందన్నారు. వారి సమాచారం మేరకు అయిదుగురిని పాత మోటారు సైకిళ్ల చోరీల్లో ఉన్నారని, గంజాయి కేసుల్లో ఉన్నారని, ప్రొద్దుటూరు రోడ్డులో వారిని అరెస్టు చేసి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి తొమ్మిది మోటారు సైకిళ్ల చోరీలకు వినియోగించే వారి వద్ద ఉన్న మరో ద్విచక్ర వాహనం, మొత్తం పదింటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారు అచ్చుకట్ల అబ్దుల్ రజాక్ (భాగ్యనగర్ కాలనీ, జమ్మలమడుగు), షేక్ గైబూసావలి (భాగ్యనగర్ కాలనీ, జమ్మలమడుగు), వినుకొండ దూదేకుల నాయబ్‌రసూల్ (శ్రీరాంనగర్, జమ్మలమడుగు), వనం రామ్‌చరణ్ (బీసీ కాలనీ, జమ్మలమడుగు), షేక్ పెద్దమస్తాన్ (వెంకటేశ్వర కాలనీ, జమ్మలమడుగు) పట్టుబడిన వారిని విచారించగా జమ్మలమడుగు, ఒంటిమిట్ట, తలమంచిపట్నం, ఓర్వకల్లు, హైదరాబాదు, కర్నూలు, తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్ల, హైదరాబాదు, కర్నూలుకు చెందినవి పరిశీలించాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు. వాటి విలువ మొత్తం రూ.10 లక్షలు అవుతుందని, స్వాధీనం చేసుకున్న వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దాసు, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, పట్టుబడిన దుంగలు

సాగులో 'నానో' విప్లవం

నంగనూరుపల్లెసమీపంలో విస్తారంగా సాగైన వరిపైరు



- నానో ఎరువు... రైతుకు తగ్గనున్న బరువు
- రవాణా ఖర్చులో ఊరట
- సుభిక్షంగా భూసారం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వంద కిలోల యూరియా వాడే పంటలో కేవలం అరలీటరు నుంచి ఒక లీటరు నానో నత్రజని లిక్విడ్ సరిపోతే... ఇతర పోషకాలు అరలీటరు, లీటరుతో సరిపోతే... దాదాపు సూక్ష్మపోషకాలన్నీ కిలోలకు బదులు మిల్లీ లీటర్లలో పంటకు అవసరమైతే... అంతకుమించిన వరం రైతన్నకు మరొకటి ఉండదు. దీన్ని సుసాధ్యం చేస్తూ వ్యవసాయంలో అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధమవుతోంది నానో టెక్నాలజీ. వ్యవసాయ రంగంలో శాస్త్ర ప్రగతి దినదినాభివృద్ధి చెందిన నేపథ్యంలో సేద్య రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతోంది. సూక్ష్మరూపంలో లభ్యమయ్యే నానో ఫర్టిలైజర్ పంటల్లో పోషకాలు, సూక్ష్మపోషకాలను సమర్థవంతంగా అందించడం వలన రైతులకు ఎరువుల వాడకం తగ్గుతుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించడంతోపాటు పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. ఈ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో రెండో హరిత విప్లవానికి నాంది అని వ్యవసాయ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.

నానో ఎరువులపై అవగాహన లేక...

అన్నదాతకు ఎరువు భారం తగ్గించేందుకు ప్రభుత్వం నానో ఎరువులను అందుబాటులోకి తెచ్చింది. కానీ వీటిపై రైతుల్లో ఇంకా పూర్తిస్థాయిలో అవగాహన లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్కువ ధరతోపాటు సులభంగా రవాణా చేసేందుకు వీలున్న నానో ఎరువులు, బయో ఎరువులను వినియోగిస్తే మేలు చేకూరుతుందని అధికారులు సూచిస్తున్నారు. ప్రొద్దుటూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో సాధారణ వరి సాగు విస్తీర్ణం. ప్రొద్దుటూరు మండల పరిధిలో 3,700 ఎకరాలు, జమ్మలమడుగు మండలంలో 2,700, పెద్దముడియం మండలంలో 800, మైలవరం మండలంలో 650 ఎకరాల సాధారణ వరి విస్తీర్ణం ఉండగా ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సాగునీరు లభ్యతను బట్టి వరి సాగు వివిధ దశల్లో ఉంది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో పనులు ఊపందుకున్నాయి. వరి పండిస్తున్న రైతులు ఎక్కువగా యూరియా, డీఏపీ ఎరువులు వాడుతున్నారు. వీటి ధర ఎక్కువ కావడంతో, సమయానికి నీటి తడులు ఎక్కువైనా, తక్కువైనా ఎరువులు వృథా అవ్వవచ్చు. ఆ స్థితి నుంచి రైతులు ఉపశమనం పొందాలంటే నానో ఎరువులు పనికొస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

నానో వైపు అవగాహన కల్పిస్తున్నాం



ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో నానో యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయి. వీటి వినియోగంతో రైతులకు ఆర్థికభారం, శారీరక శ్రమ తగ్గుతాయి. సాధారణ యూరియా, డీఏపీలు ఎంత పనిచేస్తాయో నానో యూరియాలో అంతకుమించి ప్రభావం ఉంటుంది.సాధారణ ఎరువులు వేసేందుకు రైతులు ఉండాలి. నానో ఎరువులు డ్రోన్ ద్వారా, డ్రమ్ ద్వారా కూడా పిచికారి చేసుకోవచ్చు. ఈ నానో టెక్నాలజీపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

- సాంబ వరాహరికుమార్, ఏవో, ప్రొద్దుటూరు.



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న నానోయూరియా, నానో డీఏపీ

సాంప్రయదాయ ఎరువు కన్నా ధర తక్కువ

రైతు సేవా కేంద్రాల ద్వారా బస్తా యూరియా ధర సుమారు రూ.267కు లభిస్తుంది. అదే బయట మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నారు. దాన్ని ఇంటికి తీసుకు రావడానికి మరికొంత ఖర్చు అవుతుంది. అదే నానో యూరియా 500 మి.లీ. బాటిల్ ధర మార్కెట్‌లో రూ.270. ఎకరాకు ఒకటిన్నర బస్తా సాంప్రదాయ యూరియా అవసరం అయితే నానో యూరియా 500 మి.లీ. బాటిల్ సరిపోతుంది. ప్రభుత్వం డీఏపీ బస్తా రూ.1350కి విక్రయిస్తుండగా బయటి మార్కెట్‌లో రూ.1450 నుంచి రూ.1500 వరకు పలుకుతోంది. అదే నానో డీఏపీ లీటరు ధర రూ.570కి అమ్ముతున్నారు. సాధారణ ఎరువులు అయితే బస్తాలను మోసుకెళ్లాలి. నానో ఎరువులైతే డబ్బాను ఎక్కడికైనా చేతిలో పట్టుకుని వెళ్లిపోవచ్చు. ఎకరాకు లీటరు ద్రావణం సరిపోతుంది. అదే ఎరువును ఒక్కసారి లేదా రెండుసార్లు పిచికారి చేస్తే చాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఇంకా ఏపీ ఎస్ఆర్ఏసీ, ఏపీఎస్ఎమ్‌డీసీ, ఏపీ గ్రౌండ్ వాటర్ బోర్డ్ వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు అర్హులన్నారు. సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో లెక్చరర్‌గా, సెంట్రల్ గవర్నమెంట్ ఓఎన్‌జీసీ, జీఏఐఎల్, సెయిల్, కోల్ ఇండియా లిమిటెడ్, బీపీఎల్, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8985597928, 9985442196 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అంతర్జాతీయ సదస్సుకు వైవీయూ ప్రొఫెసర్ జయరాజుకు ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలోని భూవిజ్ఞాశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎన్.జయరాజుకు యూకేలోని స్కాట్లాండ్ సెయింట్ ఆండ్రూస్ యూనివర్సిటీ నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈయన ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే సదస్సులో భారతదేశ తూర్పు తీరంలోని కొన్ని ప్రాంతాల నుంచి సముద్ర కాలుష్యాన్ని విశ్లేషించడానికి మలస్కన్ షెల్స్ వినియోగం అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ప్రొఫెసర్ జయరాజు గతంలో 70 దేశాలలోని అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణ చేశారు. ప్రొఫెసర్ జయరాజుకు అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందడం పట్ల వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ అధ్యాపకులు ప్రొఫెసర్ రఘుబాబు, ప్రొఫెసర్ సునీత, సహాఆచార్యులు శ్రీనివాసగౌడ్, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



సునీల్‌కుమార్ మృతదేహం

చాపాడు, ఆగస్టు 18: మండలంలోని బద్రిపల్లి బస్టాప్ వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సునీల్‌కుమార్ (30) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కేతవరం గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ బైక్‌పై వెళుతుండగా లారీ వెనుక వైపు నుంచి ఢీ కొంది. దీంతో సునీల్‌కుమార్ రెండు కాళ్లు విరిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనంలో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ - స్కూటరు ఢీ... ఇరువురికి గాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న స్థానికులు

కమలాపురం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన మఠం చందు, ఖాజీపేట మండలం కొట్లూరుకు చెందిన నవీన్ కలిసి పని నిమిత్తం కమలాపురం నుంచి ఎర్రగుంట్లకు వెళుతున్నారు. పందిళ్లపల్లె గ్రామ సమీపంలోకి రాగానే అదే దారిలో వెళుతున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఢీకొట్టారు. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. చందుకు రెండు కాళ్లు విరిగాయి. స్థానికులు 108లో కడప రిమ్స్‌కు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలిన మిద్దె... త్రుటిలో తప్పిన ప్రమాదం



కూలిన దంతెల మిద్దె



ప్రమాదం నుంచి బయటపడిన ఓబులమ్మ

మైదుకూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి దంతెల మిద్దె కూలింది. అదృష్టవశాత్తు ఇంట్లో నివశిస్తున్న మహిళకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా.. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పాతూరులో ఓబులమ్మ అనే మహిళ అద్దె ఇంట్లో నివసిస్తోంది. సోమవారం ఉదయం నిద్రలేచి ఇంటి పని అంతా చేసుకొని ఇంటి బయటకు రాగానే ఒక్కసారిగా ఇంటి పైకప్పు కుప్పకూలిపోయింది. దీంతో ఆమె ఎటువంటి ప్రమాదం లేకుండా బయట పడిందని స్థానికులు తెలిపారు. ఇంట్లోని సామాన్లు అన్ని మట్టి కుప్పలో కలిసిపోయి తీవ్రంగా నష్టపోయానని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ గడువు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డి-ఫార్మసీ పూర్తి చేసిన వారికి వందశాతం ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌జ్యోతి తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 19వ తేదీతో గడువు ముగియనుందని చెప్పారు. రేషన్ కార్డు, తక్కువ ఇన్‌కమ్ కలిగిన పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ చేసిన విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9440144057. 9981353745. 9885355377 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే పాలిటెక్నికల్ కళాశాల వెబ్‌సైట్‌లో కూడా సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు.

ఆకాంక్షల జిల్లా అభివృద్ధిలో అగ్రస్థానం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్,ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ఆకాంక్షల జిల్లాల అభివృద్ధిలో పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కంటే మన జిల్లా అగ్రస్థానంలో 73.8 స్కోర్‌తో ఉందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ఆకాంక్షల జిల్లాలలో జరుగుతున్న సామాజిక, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధే లక్ష్యంగా సాగుతు న్న ప్రక్రియలో మన జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఆకాంక్షల జిల్లా కార్యక్రమాలను సమర్థవంతగా అమలు చేయాలని ఆదేశించారు. ఆకాంక్ష జిల్లాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను నీతి అయోగ్ పర్యవేక్షిస్తోందన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతోందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో 89.6 స్కోర్‌తో 35వ ర్యాంకులో, విద్యలో 71 స్కోర్‌తో 100వ ర్యాంక్, వ్యవసాయంలో 62.9 స్కోర్‌తో 24 వ ర్యాంక్, ఆర్థికాభివృద్ధిలో 46.7 స్కోర్‌తో 71వ ర్యాంక్‌లో, మౌలిక సదుపాయాల్లో 81.7 స్కోర్‌తో 34వ ర్యాంకులో ఉన్నామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో వైద్యశాఖ విస్తృత సేవలందించాల న్నారు. ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, వైద్య శాఖలు సమష్టిగా పనిచేయా లన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, వ్యవసాయ అధికారి చంద్రానాయక్, ఉద్యానశాఖాధికారి రవిచంద్ర, సీపీవో హజరత్తయ్య, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై పరీక్షలు నిర్వహించాలి

జిల్లాలో మరింత మందికి సుఖవ్యాధులపై అవగాహన కల్పించి రక్త పరీక్షలు నిర్వహించేలా వైద్యశాఖ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం సభాభవనంలో ఎయిడ్స్ నిర్మూలనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్‌తోపాటు జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రవికుమార్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎన్‌జీవోలు, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో జిల్లాలో కళాశాలలు, పాఠశాలలు, లైన్ డిపార్ట్మెంట్స్ ప్రతి గ్రామానికి వెళ్లి హెచ్ఐవీ పరీక్ష, సుఖవ్యాధులపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. హెచ్ఐవీ అపోహలపై ర్యాలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జడ్పిసీఈవో ఓబులమ్మ, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ అధికారులు పాల్గొన్నారు.

చియ్యపాడు ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కడప మారుతీనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండలం చియ్యపాడు గ్రామ హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయాలని ఎంఆర్‌పీఎస్, పీఆర్ఎస్‌వైఎఫ్, ఎస్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ పాఠశాల విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కర్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, కొన్నేపల్లి మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ, పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, ఎస్ఎంఎస్ చైర్మన్ సుబ్బరామాంజనేయులు మాట్లాడారు. మేజర్ పంచాయతీ అయిన చాపాడు గ్రామ దళితవాడలో దాదాపు 60 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠ శాల ఉందన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి పాఠ శాలలో చదువుకునే విద్యార్థులు 52 మంది వున్నారన్నారు. దీంతో ప్రభుత్వం ఆ పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేసే అవకాశం ఉన్నప్పటికీ... ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయడం సరికాదన్నారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కూడా చాలా తక్కువగా వుందన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి దళితవాడలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఏర్పాటు చేసి.. విద్యా భివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఆ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ అవకతవకలపై తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారి సంపత్‌కుమార్

మైదుకూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బద్వేల్, జమ్మలమడుగు మున్సిపాలిటీలలోని బిల్డింగ్‌లకు, స్థలాలకు సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్ అవకతవకలు జరిగాయి. దీనిపై సోమవారం మైదుకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌కు విజయవాడ నుంచి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిన్‌స్ట్రేషన్ అధికారి సంపత్‌కుమార్ విచ్చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలలోని అధికారులు ప్రాపర్టీ ట్యాక్స్ వేయడంలో అవకతకల జరిగినట్లు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. దీనిపై కడప జిల్లాలోని బద్వేలు, జమ్మలమడుగు మున్సిపాలిటీలలో థర్డు పార్టీతో ప్రాపర్టీ ట్యాక్స్‌లను సర్వే చేయించారు. ఆసర్వే నివేదికలపై మైదుకూరు మున్సిపాలిటీలో అధికారుల రివ్యూ మీటింగ్ పెట్టి రికార్డులను తనిఖీలు చేశారు. వారు ఇచ్చిన నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని సంపత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బద్వేల్ కమిషనర్ నరసింహారెడ్డి, జమ్మలమడుగు కమిషనర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

- రూ.9లక్షలు స్వాహా
- న్యాయం చేయాలంటూ వేడుకోలు

బద్వేలుటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నా పలుకుబడి పరపతిని ఉపయోగించి.. ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఓ కానిస్టేబుల్ తమ వద్ద నుంచి రూ.9లక్షలు తీసుకొని మోసం చేశాడని వెంకటరత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రాజుగారి వీధిలో తాము నివాసం ఉండేవాళ్లమన్నారు. అదే వీధిలో కానిస్టేబుల్ రవికుమార్ నివాసం ఉంటూ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండేవారన్నారు. తమతో బాగా సాన్నిహిత్యం కనపరుస్తూ, మీ కుమార్తె గురుదేవికి ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి 2023 సంవత్సరం నవంబరు 24వ తేదీ మా వద్ద రూ.6 ల క్షలు డబ్బులు తీసుకున్నాడని, రోజులు గడుస్తున్నా మా కూతురికి ఉద్యోగం ఇప్పించలేదన్నారు. అడిగితే మరో రూ.3లక్షలు ఇస్తేనే ఉద్యోగం వస్తుందని నమ్మబలికాడని, దీంతో మా వద్ద ఉన్న నగలను కుదవపెట్టి మరో రూ.3 లక్షలు ఇచ్చామన్నారు. తీరా చూస్తే ఆ కంపెనీలో కసువు ఊడ్చే పనిలో పెట్టాడని, రూ.9లక్షలు డబ్బులు తీసుకొని ఈ పనిలో పెడతావా అని ప్రశ్నిస్తే మీ కూతురికి ఆ కంపెనీలో ఉద్యోగం లేదన్నారు. దీంతో మా డబ్బులు మాకు ఇవ్వమని అడిగితే మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోమని మమ్మలను బెదిరించాడని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీసు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా మాకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, మంత్రిని నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్‌ను కోరుతున్నామన్నారు. ఈ విషయంపై అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులను వివరణ కోరగా, ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన కానిస్టేబుల్ రవికుమార్‌పై కేసు నమోదు చేశామని, ప్రస్తుతం కోర్టులో విచారణ జరుగుతోందని తెలిపారు.

దానం చేయడంలోనే ఆత్మసంతృప్తి



చీరలు పంపిణీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష నిపుణులు సురేష్‌బాబు దంపతులు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దానం చేయడంలోనే ఆత్మసంతృప్తి ఉంటుందని ప్రముఖ జ్యోతిషశాస్త్ర నిపుణులు ఎం.సురేష్ బాబు తెలిపారు. సోమవారం కడపలోని ఎన్జీఓ కాలనీలో సురేష్‌బాబు కుమార్తె సుహిత శాతోన్ జన్మదినాన్ని పురస్కరించుకొని 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎందరో పేద వారు ఉన్నారని అలాంటి వారికి ఏదోక సందర్భంలో ఆదుకోవాలని సూచించారు. తమ పిల్లలకు కూడా చిన్నతనం నుంచే సహాయం చేయడం నేర్పించామని తెలిపారు. కార్యక్రమంలో నిర్మలాదేవి, సుజాత, కుసుమ, స్నేహిత పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశానికి గడువు పొడిగింపు

రాజంపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 27 వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అన్నమయ్య, కడప జిల్లాల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కంపు కొడుతున్న రహదారి

● విద్యార్థులు, గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు

సిద్దవటం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగుపల్లె గ్రామంలోని రహదారి అధిక వర్షాల కారణంగా అపరిశుభ్రత పేరుకుపోయి దుర్వాసన వస్తోందని, భరించలేకున్నామని గ్రామస్థులు వాపోయారు. సోమవారం ఆ ప్రాంతవాసులు మాట్లాడుతూ గ్రామంలో అధిక వర్షాల కారణంగా రహదారిపై అపరిశుభ్రత పేరుకుపోయి


అపరిశుభ్రంగా ఉన్న వెలుగుపల్లె రహదారి


రహదారిపై అపరిశుభ్రత తొలగించాలని విద్యార్థుల ఆందోళన

దుర్వాసన మొదలైందని, విద్యార్థులు స్కూళ్లకు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంటువ్యాధులు సోకకుండా బ్లీచింగ్, అబేట్ పిచికారి చేయాలని డిమాండు చేశారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి జానకిని వివరణ కోరగా విద్యార్థులకు, గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ రహదారిపై అపరిశుభ్రత తొలగించి బ్లీచింగ్ పనులు చేపడతామని తెలిపారు.

నాగశిలల ప్రతిష్ఠ

గాలివీడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలుకుంట గ్రామం గొందిపల్లిలో వెలసిన బోయకొండ గంగమ్మ ఆలయ ప్రాంగణంలో నాగశిలల ప్రతిష్ఠ చేశారు. శ్రావణమాసం బహుళ దశమి సోమవారం వేదపండితులు, ఆలయ వ్యవస్థాపకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నాగశిలలను పూలుకుంట అమరావతి వితరణ చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా యజ్ఞగుండం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


ప్రతిష్ఠించిన నాగశిలలు

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

సుండుపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె పర్యటనకు సోమవారం వచ్చిన కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ముఖ్యంగా సుండుపల్లె-రాయచోటి డబుల్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలని, అగ్రహారం నుండి సామిసేనిగడ్డ వరకు సుమారు 7 పల్లెలకు వెళ్లే రోడ్డు గుంతలమయమైందని జనసేన నాయకుడు రామాశ్రీనివాస్ తదితరులు వినతి పత్రం అందించారు. ఊటచెరువుకు కాలువలు ఏర్పాటు చేయాలని, మట్టికట్టకు మరమ్మతులు చేయాలని నీటి సంఘం అధ్యక్షుడు రామాంజులు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యవర్గ సభ్యుడు శివకుమార్‌నాయుడు కోరారు.

తోతాపురి బాధితులకు నష్టపరిహారం

తోతాపురి బాధితులకు నష్టపరిహారం ఇంకా రాలేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గిరిజన సంఘ నాయకుడు అమృనాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నుండి బాధిత రైతులు నివేదిక పంపడం ఆలస్యమైందని, దీంతో నష్టపరిహారం రావడం ఆలస్యమైందని, ఈనెల ఆఖరికి లేదా సెప్టెంబర్‌లో కిలోకు రూ.4 చొప్పున నష్టపరిహారం రైతులకు అందుతుందని తెలిపారు. మామిడి రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

గాలివీడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చే ప్రజల అర్జీలను త్వరితగతంగా పరిష్కరించాలని తహసీల్దార్ భాగ్యలత అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వివిధ గ్రామ పంచాయతీల్లో ఎక్కువగా భూ సమస్యలు వస్తున్నాయని, క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలకు న్యాయం చేయాలని వీఆర్వోలకు సూచించారు. ముటేషన్, వివిధ రకాల సర్టిఫికేట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ

ఓబులవారిపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలో విద్యుత్ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం విచారణ చేయడం జరుగుతుందని విజిలెన్స్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చిన్నఓరంపాడు సచివాలయం జూనియర్ లైన్‌మెన్, సబ్‌స్టేషన్‌లో పనిచేసే మరొక సిబ్బందిపై చిన్నఓరంపాడు రైతులు, గ్రామస్థులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిబ్బంది, ఫిర్యాదుదారులతో పాటు ఇబ్బందులు ఎదుర్కొన్న, లంచాలు ఇచ్చిన వారిని కలిసి వివరాలు సేకరించి రికార్డు స్టేట్‌మెంట్ చేశారు.


గ్రామస్థులను విచారిస్తున్న విజిలెన్స్ ఎస్ఐ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఆకుల తిరుమల బాబు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానదిలో నీటి ప్రవాహం పెరిగిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆకులవీధి, గాండ్లపాలెం, వంతాటిపల్లె, గొల్లపల్లె, జ్యోతి, పలు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామాల్లో అందుబాటులో ఉంటారని, ఏదైనా విపత్తు సంభవిస్తే 9704898945, 8074229387, 7674950729 నంబర్లకు సమాచారం తెలపాలని తహసీల్దారు తెలిపారు.

నదీ పరివాహక ప్రాంతంలోకి వెళ్లరాదు

● ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నదీ పరివాహక ప్రాంతంలోకి వెళ్లరాదని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పింఛా ప్రాజెక్టు నుండి నదిలోకి నీటిని విడుదల చేయడంతో పరివాహక ప్రాంతంలో, నదిని దాటే ప్రాంతాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చిన్నారులు, చేపల వేటకు వెళ్లేవారు, పశువుల కాపర్లు, ప్రజలు నదీ తీరంలోకి వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. హెచ్చరికలు కాదని ఎవరైనా చేపల వేటకు వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నరసింహ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చిట్వేలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మానవతా చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని తిమ్మాయపాలెం క్రాస్ వద్ద ఉన్న దస్తగిరి నారాయణ తపోవనం ఆశ్రమానికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ మేరకు మానవతా సంస్థ అడ్వైజర్ బోర్డు సభ్యుడు, నక్కలపల్లి మాజీ సర్పంచ్ మద్దిన చంద్రమోహన్‌నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు దాతను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ కె.సాయిరాం, కో చైర్మన్ గుత్తి నరసింహ, కార్యదర్శి మునిరావు, కన్వీనర్ దొండ్లవాగు శ్రీనివాసులు, సభ్యులు బాజీ, శివరాజు, చింటు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులు అందించిన చంద్రమోహన్‌నాయుడు

రాయచోటి ఉప విద్యాశాఖ అధికారిగా నాగయ్య

రాయచోటిటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఉప విద్యాశాఖ అధికారిగా ఎల్. నాగయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాయచోటి విద్యాశాఖ డివిజన్ అధికారిగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న శివప్రకాశ్‌రెడ్డి పదవీవిరమణ పొందడంతో గత కొన్ని నెలలుగా ఆ స్థానం ఖాళీగా ఉంది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులతో జిల్లా పరిధిలోని నందలూరు మండల విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న ఎల్.నాగయ్య పదోన్నతిపై రాయచోటి ఉప విద్యాశాఖ అధికారిగా (డీవైఈవో) బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎల్. నాగయ్యకు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ఎస్టీఏ నాయకులు వేణుమాధవ్‌రాజు, కొండూరు మురళీమోహన్‌రాజు, వెంకటసుబ్బయ్య, హరిప్రసాద్, ఉపాధ్యాయులు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన డీవైఈవో నాగయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో కలిసి పని చేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు శ్రేష్ఠమైనవి

రామాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలు శ్రేష్ఠమైనవని ప్రకృతి వ్యవసాయ అధికారులు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రామాపురంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన పంటల ఉత్పత్తులను విక్రయించారు. చుట్టుపక్కల గ్రామాల రైతులు తాము పండించిన ప్రకృతి వ్యవసాయ కూరగాయలను తీసుకువచ్చి రామాపురంలో విక్రయించారు. ఈ ఉత్పత్తులను క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు వాడకుండా కేవలం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు శ్రీదేవి, వెంకట్రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ కూరగాయలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వైభవం.. వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుల వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలతో వేదమంత్రాల మంత్రోచ్చారణల మధ్య ఆలయం చుట్టూ, మాఢవీధుల్లో పల్లకీ ఊరేగింపు నిర్వహించారు.


పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

రాజంపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు, వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పాతబస్టాండు కూడలిలో డ్రైవర్స్ యూనియన్ నేతలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన నూతన మోటార్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 20న రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు, మోటారు కార్మికులకు వాహనమిత్ర పథకాన్ని అందించారని, తిరిగి ఈ పథకాన్ని అమలు చేసి ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ నాయకులు సురేష్, నాయక్, కొండయ్య, ఆకాష్, హరి, నరసింహ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


పాతబస్టాండులో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రాయచోటిటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో సోమవారం హోమగుండం, చండీ ప్రధాన కలశ స్థాపన, యంత్ర స్థాపన, అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అమ్మవారి దర్శనానికి పట్టణంలోని నలుమూలల నుండి వచ్చినన భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాబోవు 41రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అమ్మవారిని అద్దంలో చూస్తున్న భక్తులు

ఆర్టీ‘షీ’ బస్టాండు..


రైల్వేకోడూరు ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

రైల్వేకోడూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడంతో ప్రతిరోజూ మహిళలు వివిధ పనుల కోసం తిరుపతి, కడప, రాజంపేట ప్రాంతాలకు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాలు సెలవు ఉండడంతో సోమవారం ఒక్కసారిగా మహిళలు బస్టాండు చేరుకున్నారు. అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువగా మహిళలే ప్రయాణం చేస్తున్నారు. కళాశాలలు, వ్యాపారం తదితర రంగాలకు చెందిన మహిళలకు పూర్తిగా టిక్కెట్టు లేని ప్రయాణం సులభంగా మారింది.


బస్సు ఎక్కుతున్న మహిళలు

రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలి

వీరబల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల తమ గ్రామంలో 47 దివ్యాంగుల పింఛన్లను రద్దు చేశారని, తిరిగి వాటిని పునరుద్ధరించాలని మట్లి సర్పంచ్ నాగార్జునాచారి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. 47 మందిలో పదిమందికి గానూ వికలాంగ పింఛన్ మార్పు చేసి ప్రస్తుతం రూ.4వేలు ఇస్తున్నారని, వీరందరూ కూడా పూర్తిగా వికలత్వం కలిగిన అర్హులేనన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైఅధికారుల దగ్గర నుంచి వత్తిడి ఉందని, ప్రతి రోజు పీజీఆర్ఎస్ సమస్యలను పరిష్కారం చేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల తహసీల్దార్ గల్లా రమణ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్అండ్‌బీ డీఈ జయప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నిజమైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలి

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నిజమైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని వికలాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకుడు ముప్పాల వెంకట్రామరాజు, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డితో కలిసి డీఆర్వో, డీసీహెచ్ అధికారి ఆంజనేయులకు వినతి పత్రం అందించారు. నిజమైన దివ్యాంగులు కూడా అర్హులు కాదని డాక్టర్లు ఏ విధంగా ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు. ఈ సర్వేలతో తమ కుటుంబాలకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. రీసర్వే పెట్టి నిజమైన దివ్యాంగులకు సదరం సర్టిఫికేట్లు మంజూరు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో మల్‌రెడ్డి, ఆంజనేయులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ

ఓబులవారిపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీవో కమ్మపల్లెలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాధనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు పాల్గొని ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వారిని పెద్దఓరంపాడు చెరువునీటి సంఘం ఉపాధ్యక్షుడు ఓరుగంటి ధర్మతేజ్, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాయుడోరి రమణ, టీడీపీ సీనియర్ నాయకుడు చప్పిడి రమేష్ బాబు, మాజీ సర్పంచ్ ముక్కర శంకర్, మాజీ ఎంపీటీసీ వేమన రవీందర్‌నాయుడు, పోతినేని శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

భుజంగేశ్వరుడికి శ్రావణ మాస పూజలు

రైల్వేకోడూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రావణమాస పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శివుడికి అభిషేకాలు చేశారు. అలాగే భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దగ్గుబాటి సంకల్పం ఆదర్శనీయం

కలకడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాను చదివిన పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకున్న లయన్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. దగ్గుబాటి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో రూ.10.40 లక్షలు వెచ్చించి బాటవారిపల్లె హైస్కూల్‌లో పూర్తయిన ప్రవేశమార్గం ఆర్చి, గేట్, ఫెన్సింగ్‌లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన వారు మాట్లాడుతూ అందరికీ గుర్తుండిపోయేలా 2022లో ఇదే పాఠశాలలో రూ.6 లక్షలు ఖర్చు చేసి కళావేదికను ఏర్పాటు చేశారని, అలాగే టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారన్నారు. దగ్గుబాటి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలన్నదే జీవిత లక్ష్యమన్నారు. అనంతరం దగ్గుబాటి వెంకటేశ్వరరావును హెచ్ఎం వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా కలకడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బరకం శ్రీనివాసులరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భానుమూర్తిరెడ్డి, రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్, రజనీకుమార్, అబ్బూరి తిరుపతినాయుడు, కాంతారావు, వైవీ రమణ, పాల్గొన్నారు.


దగ్గుబాటి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విధులకు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు....

● ముదివేడు క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం..

● కంటైనర్-ద్విచక్రవాహనం ఢీకొని హోంగార్డు మృతి



మృతి చెందిన హోంగార్డు ఈశ్వర్‌నాయక్

కురబలకోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కడప-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిపై ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం కోటకొండ తండా వాసి ఈశ్వర్‌నాయక్ హోంగార్డుగా పనిచేస్తున్నాడు. కాగా ఆయన మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాత్రి వేళ విధులకు కోసం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యలోని ముదివేడు క్రాస్ మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న కంటైన ర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహననంలో ప్రయాణిస్తున్న ఈశ్వర్‌నాయక్ అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ చేరుకుని విచారించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడి కుటుంబీకుల రోదనలు ఆస్పత్రిలో మిన్నంటాయి. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు ముదివేడు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పశుసంవర్ధకశాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు




పి.లలిత, వి.ఎస్.కె. మైనుద్దీన్

పీలేరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తమ శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగుల ఉత్తమ పనితీరుకు ప్రశంసాపత్రాలు లభించినట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై సోమవారం తెలిపారు. పీలేరులోని నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ల్యాబ్ టెక్నీషియన్ పి.లలిత, మదనపల్లెలోని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ వి.ఎస్.కె. మైనుద్దీన్‌కు ఏటా స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అందించే ప్రశంసా పత్రాలకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. వారిద్దరికీ ఈ నెల 20వ తేదీన విజయవాడలోని తమ శాఖ ప్రధాన కార్యాల యంలో జరిగే కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందిస్తారని తెలి పారు. పీలేరులో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పి.లలిత, తన పనితీరు కారణంగా అనేక పశువ్యాధుల చికిత్సలో వైద్యులకు సహాయ కారిగా ఉంటున్నారన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి వారిద్దరూ ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కన్నెమడుగు విద్యార్థిని



విద్యార్థిని సంధ్య

తంబళ్లపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన టి.సంధ్య జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌భాష తెలిపారు. అన్నమయ్య జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ సురేష్ బాబు, జిల్లా కార్యదర్శి గౌతం, ఏపీ షూటింగ్ బాల్ కార్య దర్శి పరశురాముడు నుంచి ఎంపిక ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 25, 26 తేదీల్లో వశిష్ట ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సంధ్య జిల్లా తరుపున పాల్గొని సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. 22, 23, 24 బీహార్ రాష్ట్రం బుద్ధ గయలో జరిగే 44వ జాతీయ స్థాయి పోటీల్లో సంధ్య పాల్గొంటుంద న్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సంధ్యను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం మదన్‌మోహన్, పీడీ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రాజంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. రాజంపేట ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పింఛా డ్యాం నిండినందున కలెక్టర్ ఆధ్వర్యంలో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ నేపథ్యంలో చెయ్యేరు నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మన్నారు పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు బాలరాజుపల్లె వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వరదనీరు ఎక్కువగా వస్తున్నందున ఎవరూ చెయ్యేరు నదిలోకి వెళ్లరాదని, రాజంపేట, నందలూరు, పెనగలూరు, చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ములకలచెరువు మార్కెట్టే టాప్...!

● రికార్డు స్థాయిలో టమోటా క్రయ విక్రయాలు... ఎగుమతులు

● మదనపల్లెను మళ్లీ వెనక్కినెట్టిన వైనం

● మార్కెట్‌కు పోటెత్తుతున్న టమోటాలు

● మార్కెట్‌కు రూ.కోట్లలో ఆదాయం

● రైతులకు గుక్కెడు నీరు... కనీస వసతులు కరువు



ములకలచెరువు మార్కెట్‌కు భారీగా అమ్మకానికి వచ్చిన టమోటాలు

ములకలచెరువు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): టమోటా క్రయ విక్రయాలు...ఎగుమతుల్లో టాప్‌గా ములకలచెరువు టమోటా మార్కెట్ నిలిచింది. ఆసియాలోనే నెంబర్ వన్ మార్కెట్టైన మదనపల్లెను మళ్లీ వెనక్కి నెట్టింది. ఇంకా సీజనే ప్రారంభం కాలేదు...అప్పుడే మార్కెట్‌కు టమోటాలు పోటెత్తుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో సీజన్ ప్రారంభమవుతుంది. టమోటాలు మరింతగా అమ్మకానికి వస్తాయి....టమోటా మార్కెట్ కళకళలాడుతోంది. అత్యధికంగా రైతులు పండించిన టమోటాలను ఇక్కడికే అమ్మకానికి తెస్తున్నారు. మార్కెట్‌కు రూ.కోట్లలో ఆదాయం...అయినా ఇక్కడ రైతులకు గుక్కెడు నీరు, కనీస వసతులు కరువయ్యాయి. ఏళ్ల తరబడిగా రైతుల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు.

తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి వ్యవసాయ మార్కెట్ ములకలచెరువులో ఉంది. దీనికి 1977లో ప్రారంభించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలతో పాటు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలలోని పలు గ్రామాల రైతులు టమోటాలను విక్రయించేందుకు ఇక్కడికి తీసుకొస్తారు. ప్రతిరోజూ వందలాది మంది రైతులు మార్కెట్‌కు వస్తుంటారు. సీజన్‌లో అయితే రైతుల సంఖ్య రెట్టింపుగా ఉంటుంది.



పిల్లర్లకే పరిమితమైన వాణిజ్యగదుల నిర్మాణం

టాప్ ప్లేస్‌లోకి ములకలచెరువు మార్కెట్

ములకలచెరువు టమోటా మార్కెట్ టాప్ ప్లేస్‌లోకి వచ్చింది. టమోటా క్రయ విక్రయాలు, ఎగుమతుల్లో ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌ను ములకలచెరువు మళ్లీ వెనక్కి నెట్టింది. 20 రోజులుగా మదనపల్లె కంటే ములకలచెరువు వ్యవసాయం మార్కెట్‌కు అత్యధికంగా టమోటాలు అత్యధికంగా వస్తున్నాయి. క్రయవిక్రయాలతో పాటు ఇతర రాష్ట్రాలకు అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. సాయంత్రం మార్కెట్ కావడంతో రైతులకు ఎంతో అనుకూలంగా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌కు టమోటాలు పోటెత్తుతున్నాయి. ప్రతిరోజూ 300 నుంచి 500 మెట్రిక్ టన్నుల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. మదనపల్లెలో కేవలం 140 నుంచి 300 మెట్రిక్ టన్నులు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. దీనిని బట్టి చూస్తే ములకలచెరువు మార్కెట్ టాప్ ప్లేస్‌లో ఉంది. గత ఏడాది సీజన్‌లో కూడా ములకలచెరువు మార్కెట్‌లో మదనపల్లె మార్కెట్ కంటే అత్యధికంగా టమోటా క్రయవిక్రయాలు, ఎగుమతులు అయ్యాయి. తాజాగా మళ్లీ సీజన్ ప్రారంభం కాక ముందే మదనపల్లెను వెనక్కి నెట్టి మొదటి స్థానానికి చేరింది. సీజన్‌లో మరింతగా క్రయవిక్రయాలు, ఎగుమతులు జరగనున్నాయి. అలాగే మార్కెట్ కమిటీ ఆదాయం లక్ష్యాన్ని మించి వస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి లక్ష్యం కాగా రూ.1.10 కోట్లు, 2023-24లో రూ.1.10 కోట్లు లక్ష్యం కాగా రూ.1.12 కోట్లు, 2024-25లో రూ.1.24 కోట్లు లక్ష్యం కాగా 1.32 కోట్లు ఆదాయం వచ్చింది. టమోటాలు ఎగుమతి చేసే వాహనాలకు విధించే సెస్సుల ద్వారా ఈ ఆదాయం సమకూరుతోంది.

వైసీపీ పాపం....రైతులకు శాపం

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ములకలచెరువు మార్కెట్ కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ప్రభుత్వానికి ములకలచెరువు మార్కెట్ ద్వారా రూ.కోట్లలో ఆదాయం ఉన్నా రైతులకు మాత్రం కనీస వసతులు కల్పించడంతో విఫలమైంది. రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని ఊదరగొట్టిన వైసీపీ ప్రభుత్వం చేతుల్లో మాత్రం చూపలేదన్నడానికి ములకలచెరువు మార్కెట్టే నిదర్శనం. మార్కెట్‌లో నాలుగేళ్ల పాటు కనీసం తాగునీటి వసతి కల్పించలేదు. మార్కెట్‌లో ఉన్న తాగునీటి వాటర్ ప్లాంటు మరమ్మతులు చేయించడానికి పాలకులకు తీరిక దొరక్కుండా పోయింది. మార్కెట్లలో మండీ యజమానులు తాగునీటి సౌకర్యం కల్పించడంతో ఉపశమనంగా ఉంది. దూరప్రాంతాల నుంచి వస్తున్న రైతులకు విశ్రాంతి తీసుకునేందుకు భవనం నిర్మించలేదు. 2021 అక్టోబరులో మార్కెట్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అప్పట్లో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు అరకొరగా 15 వాణిజ్య గదుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, క్యాంటీన్ నిర్మాణానికి రూ.77 లక్షలు మంజూరు చేశారు. ఇందుల్లో కేవలం వాణిజ్య గదుల నిర్మాణాలను మాత్రం ప్రారంభించి కొంత మేరకు పనులు చేపట్టి వదిలేశారు. మిగిలిన పనులు ప్రారంభించలేదు. దీంతో నిధులన్నీ వెనక్కి వెళ్లాయి. మార్కెట్‌లో కనీస వసతుల కల్పనపై రైతులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్‌లో సీసీ రోడ్డులు వేయాల్సి ఉంది. రైతులకు తాగునీటి వసతి కల్పన, విశ్రాంతి గది నిర్మించాల్సి ఉంది. అలాగే మరుగుదొడ్ల కొరత కూడా తీర్చాల్సి ఉంది.

టమోటా ఎగుమతి అవుతున్న రాష్ట్రాలు...దూరం

ములకలచెరువు మార్కెట్ నుంచి టమోటాలు ఎగుమతి అవుతున్న రాష్ట్రాలు, వాటి దూరం ఇలా ఉంది. ములకలచెరువు నుంచి మహారాష్ట్ర (1000 కిలోమీటర్లు), చత్తీస్‌ఘడ్ (1233 కిలోమీటర్లు), కోల్‌కతా (1741 కిలోమీటర్లు), ఝార్ఖండ్ (1890 కిలో మీటర్లు), ఉత్తరప్రదేశ్ (2038 కిలోమీటర్లు), ఉత్తరాఖండ్ (2388 కిలోమీటర్లు), జమ్ము (2825 కిలోమీటర్లు). ఇక్కడి నుంచి టమోటాలు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి టమోటాలకు బయటి రాష్ట్రాల్లో డిమాండ్ బాగా ఉంది.

మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి



ములకలచెరువు మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నాం. రైతుల విశ్రాంతి భవనం, కమిటీ కార్యాలయం నవీకరణకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపాము. అలాగే ఆగిన వాణిజ్య గదుల నిర్మాణానికి ప్రతిపాదించాం. తాగునీటి వాటర్ ప్లాంట్ మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం. మార్కెట్‌లో విడతల వారీగా సమస్యలన్నంటిని పరిష్కరిస్తాం.

- నవీన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, ములకలచెరువు

వైభవంగా మల్లన్న కుంభాభిషేక మహోత్సవం

● శివనామస్మరణతో మార్మోగిన మల్లయ్యకొండ

తంబళ్లపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం వరుణయాగం, కుంభాభిషేకం, రాత్రి దీపారాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడి పంటలతో సభిక్షంగా ఉండాలని ఏటా మల్లయ్యకొండపైన కుంభాభిషేకం, వరుణయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆలయ ఈఓ మునిరాజ ఆధ్వర్యంలో వేదపండితులు వెంకట్రమణ, కుమారస్వామి, ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామి కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం 9 గంటలకు నవగ్రహ పూజ, 10:30 నుంచి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ వరుణయాగం హోమం నిర్వహించారు. ఆలయంలోని శివలింగానికి 101 బిందెల నీటితో అభిషేకించి ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుంభాభిషేకాన్ని తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాలు, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు కుటుంబ సమేతంగా అశేషంగా తరలివచ్చారు. భక్తులు చేసే శివనామస్మరణతో మల్లయ్యకొండ మార్మోగింది. కొండ పైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి సౌకర్యం కులగకుండా ఆలయ రికార్డు అసిస్టెంట్ కొండ కిట్ట, సిబ్బంది ఈశ్వర అన్ని ఏర్పాట్లు చేశారు.



మల్లయ్యకొండ పైన వరుణయాగం చేస్తున్న వేద పండితులు

కొండపైకి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన స్త్రీ శక్తి పథకం ద్వారా మల్లయ్యకొండ పైకి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. సోమవారం సుమారు 250 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో మల్లయ్యకొండకు ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.. టీడీపీ బీసీ నేత చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ మణి, ఎస్ఎంసీ ఛైర్మన్ శివకుమార్, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు ఆర్టీసీ సిబ్బందితో కలసి కొండకు వెళ్లే మహిళా భక్తులకు ఉచిత టికెట్ కొట్టారు. మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదుదారులకు బాసటగా నిలవండి : ఎస్పీ

రాయచోటిటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు బాసటగా నిలవడంతో పాటు బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని తెలిపారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

ముగ్గురు 'రిమ్స్' వైద్యులపై అభియోగాల విచారణకు కొత్త అధికారి

● కార్యాలయం సూపరింటెండెంట్‌పై కూడా

కలికిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కడప 'రిమ్స్' వైద్యులపై నమోదైన అభియోగాలపై విచారణ నిర్వహించేందుకు కొత్త అధికారిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో రిమ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులతో పాటు మరో కార్యాలయం సూపరింటెండెంట్‌పై అభియోగాలు నమోదయ్యాయి. రిమ్స్‌లో పనిచేస్తున్న ఆర్థో విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సురేశ్వరరెడ్డి, అదే విభాగంలోని మరో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.సంజీవయ్య, కంటి విభాగంలో పనిచేసే అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీడీఎల్ సత్యనారాయణ, కార్యాలయం సూపరింటెండెంట్ షేక్ మహబూబ్‌బాషాలపై కొన్ని అక్రమాలకు సంబంధించిన అభియోగాలు నమోద య్యాయి. ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణకు అప్పటి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య 2018లో ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ఈ వ్యవహారం మరుగన పడింది. తాజాగా విచారణ నిర్వహించడానికి తిరుపతి సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభును నియమిస్తూ గత ఏడాది నవంబరు 27న ఆదేశాలు జారీ అయ్యాయి. విచారణ జరుగుతుండగా తనకు ఆరోగ్యం సహకరించలేదనే కారణాలతో విచారణాధికారి తప్పుకున్నారు. తాజాగా ఈ వ్యవహారాన్ని విచారించడానికి విజయవాడ డైరెక్టరేట్ కార్యాలయంలో పనిచేసే వైద్య విద్య అదనపు డైరెక్టరు డాక్టర్ డి.వెంకటేశ్వరరావును నియమిస్తూ ఆరోగ్య వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గత విచారణాధికారి విచారణ జరిపి ఆపి వేసినప్పటి నుంచి విచారణ కొనసాగించాలని ఆదేశించారు.

బంగారు నగలు చోరీ

గాలివీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గాలివీడులోని గౌతమ్ స్కూల్ పక్కన ఉన్న మల్లయ్య ఇంటిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు నగలు దోచుకెళ్లినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. శనివారం బాధితుడు మల్లయ్య సమీప బంధువు పెద్దకర్మకు మాధవరం వెళ్లాడు. విషయం తెలుసుకున్న దొంగలు రాత్రి ఇంట్లోకి ప్రవేశించి పూజ గదిలో ఉన్న 5జతల బంగారు కమ్మలు, మూడు చైన్లు, మూడు ఉంగరాలు తదితరవి తీసుకెళ్లినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ సొమ్ము రూ.17 లక్షలు స్వాహా

● మెప్మా సిబ్బంది నిర్లక్ష్యమేనా..?

● పోలీసుస్టేషనుకు చేరిన పంచాయితీ



ప్రొద్దుటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక మహిళా సంఘాలు.. మెప్మా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో గాడి తప్పుతున్నాయి. స్వయం సహాయక మహిళా సంఘాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన ఆర్‌పీలు, సీవోలు, సీఎంఎంలు నెలనెలా సమావేశాలు నిర్వహించి వారి బుక్‌లు పరిశీలించాలి. ఇందువల్ల కొన్ని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో లీడర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ గ్రూపు సభ్యులు లోను కంతులకని ఇచ్చిన సొమ్ము బ్యాంకులో చెల్లించకుండా స్వాహా చేసి చేతులెత్తేయడంతో బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులకు లోను చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో దిక్కు తోచక గ్రూపు సభ్యులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస నగర్‌కు చెందిన నూరె స్వయం సహాయక మహిళా సంఘంలో మొదటి, రెండవ లీడర్లు ఇద్దరు గ్రూపు సభ్యుల లోను కంతులకు అని ఇచ్చిన రూ.17.50 లక్షల సొమ్మును బ్యాంకు లో కట్టకుండా స్వాహా చేశారు.ఈ విషయం గత కొంతకాలంగా మెప్మాసిబ్బందికి తెలిసి మల్లగుల్లాలు పడుతున్నారు. ఇద్దరు లీడర్లు డబ్బులు కడతామని చెప్తూ వాయిదాలు వేస్తూ చివరికి చేతులు ఎత్తేయడం బ్యాంకు అధికారులు లోను డబ్బులు గ్రూపు సభ్యులు కట్టాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇవ్వడంతో గ్రూపు సభ్యులు ఆందోళన చెంది సోమవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. తాము తీసుకున్న రూ 20 లక్షల బ్యాంకులోనుకు సంబంధించి కంతులన్ని కట్టామని అయిన 17.50 లక్షలు డబ్బులు బ్యాంకుకు బాకీ వున్నారని నోటీసులు అందడంతో లీడర్లు ఇద్దరి పై చర్యలు తీసుకోని వారి నుండి డబ్బు రికవరీ చేసి తక్కిన ఎనిమిది మంది గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సిఐ సదాశివయ్య ను వివరణ కోరగా డబ్బులు స్వాహా చేసిన లీడర్లు ఇద్దరితో పాటు వారి కుటుంబ సభ్యులను మెప్మా సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● అదుపులో ఐదుగురు నిందితులు

● 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జమ్మలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీలో తమ సిబ్బంది అయిదుగురు అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టుబడిన అంతర్‌రాష్ట్ర ముఠా గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 10వ తేదీన మధ్యాహ్నం సమయంలో జమ్మలమడుగు ఆర్టీసీ బస్టాండు వద్ద పార్కింగ్ చేసిన ఏపీ04డిఎస్0156 నంబరు గల హోండా ఆక్టివా స్కూటీని చోరీ చేశారని, దాని విలువ రూ.90 వేలు ఉంటుందని బాధితుడు రామమోహన్ ఫిర్యాదు చేశాడు. దీంతో జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప, ఎస్‌ఐ హైమావతి పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందన్నారు. వారి సమాచారం మేరకు అయిదుగురిని పాత మోటారు సైకిళ్ల చోరీల్లో ఉన్నారని, గంజాయి కేసుల్లో ఉన్నారని, ప్రొద్దుటూరు రోడ్డులో వారిని అరెస్టు చేసి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి తొమ్మిది మోటారు సైకిళ్ల చోరీలకు వినియోగించే వారి వద్ద ఉన్న మరో ద్విచక్ర వాహనం, మొత్తం పదింటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారు అచ్చుకట్ల అబ్దుల్ రజాక్ (భాగ్యనగర్ కాలనీ, జమ్మలమడుగు), షేక్ గైబూసావలి (భాగ్యనగర్ కాలనీ, జమ్మలమడుగు), వినుకొండ దూదేకుల నాయబ్‌రసూల్ (శ్రీరాంనగర్, జమ్మలమడుగు), వనం రామ్‌చరణ్ (బీసీ కాలనీ, జమ్మలమడుగు), షేక్ పెద్దమస్తాన్ (వెంకటేశ్వర కాలనీ, జమ్మలమడుగు) పట్టుబడిన వారిని విచారించగా జమ్మలమడుగు, ఒంటిమిట్ట, తలమంచిపట్నం, ఓర్వకల్లు, హైదరాబాదు, కర్నూలు, తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్ల, హైదరాబాదు, కర్నూలుకు చెందినవి పరిశీలించాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు. వాటి విలువ మొత్తం రూ.10 లక్షలు అవుతుందని, స్వాధీనం చేసుకున్న వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ లింగప్ప, ఎస్‌ఐ హైమావతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దాసు, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, పట్టుబడిన దుంగలు

నంగనూరుపల్లెసమీపంలో విస్తారంగా సాగైన వరిపైరు



సాగులో 'నానో' విప్లవం

- నానో ఎరువు... రైతుకు తగ్గనున్న బరువు
- రవాణా ఖర్చులో ఊరట
- సుభిక్షంగా భూసారం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వంద కిలోల యూరియా వాడే పంటలో కేవలం అరలీటరు నుంచి ఒక లీటరు నానో నత్రజని లిక్విడ్ సరిపోతే... ఇతర పోషకాలు అరలీటరు, లీటరుతో సరిపోతే... దాదాపు సూక్ష్మపోషకాలన్నీ కిలోలకు బదులు మిల్లీ లీటర్లలో పంటకు అవసరమైతే... అంతకుమించిన వరం రైతన్నకు మరొకటి ఉండదు. దీన్ని సుసాధ్యం చేస్తూ వ్యవసాయంలో అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధమవుతోంది నానో టెక్నాలజీ. వ్యవసాయ రంగంలో శాస్త్ర ప్రగతి దినదినాభివృద్ధి చెందిన నేపథ్యంలో సేద్య రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతోంది. సూక్ష్మ రూపంలో లభ్యమయ్యే నానో ఫర్టిలైజర్ పంటల్లో పోషకాలు, సూక్ష్మ పోషకాలను సమర్థవంతంగా అందించడం వలన రైతులకు ఎరువుల వాడకం తగ్గుతుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించడంతోపాటు పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. ఈ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో రెండో హరిత విప్లవానికి నాంది అని వ్యవసాయ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.

నానో ఎరువులపై అవగాహన లేక...

అన్నదాతకు ఎరువు భారం తగ్గించేందుకు ప్రభుత్వం నానో ఎరువులను అందుబాటులోకి తెచ్చింది. కానీ వీటిపై రైతుల్లో ఇంకా పూర్తి స్థాయిలో అవగాహన లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్కువ ధరతోపాటు సులభంగా రవాణా చేసేందుకు వీలున్న నానో ఎరువులు, బయో ఎరువులను వినియోగిస్తే మేలు చేకూరుతుందని అధికారులు సూచిస్తున్నారు. ప్రొద్దుటూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో సాధారణ వరి సాగు విస్తీర్ణం. ప్రొద్దుటూరు మండల పరిధిలో 3,700 ఎకరాలు, జమ్మలమడుగు మండలంలో 2,700, పెద్దముడియం మండలంలో 800, మైలవరం మండలంలో 650 ఎకరాల సాధారణ వరి విస్తీర్ణం ఉండగా ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సాగునీరు లభ్యతను బట్టి వరి సాగు వివిధ దశల్లో ఉంది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో పనులు ఊపందుకున్నాయి. వరి పండిస్తున్న రైతులు ఎక్కువగా యూరియా, డీఏపీ ఎరువులు వాడుతున్నారు. వీటి ధర ఎక్కువ కావడంతో, సమయానికి నీటి తడులు ఎక్కువైనా, తక్కువైనా ఎరువులు వృథా అవ్వవచ్చు. ఆ స్థితి నుంచి రైతులు ఉపశమనం పొందాలంటే నానో ఎరువులు పనికొస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

నానో వైపు అవగాహన కల్పిస్తున్నాం



ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో నానో యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయి. వీటి వినియోగంతో రైతులకు ఆర్థికభారం, శారీరక శ్రమ తగ్గుతాయి. సాధారణ యూరియా, డీఏపీలు ఎంత పనిచేస్తాయో నానో యూరియాలో అంతకుమించి ప్రభావం ఉంటుంది.సాధారణ ఎరువులు వేసేందుకు రైతులు ఉండాలి. నానో ఎరువులు డ్రోన్ ద్వారా, డ్రమ్ ద్వారా కూడా పిచికారి చేసుకోవచ్చు. ఈ నానో టెక్నాలజీపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

- సాంబ వరాహరికుమార్, ఏవో, ప్రొద్దుటూరు.



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న నానోయూరియా, నానో డీఏపీ

సాంప్రయదాయ ఎరువు కన్నా ధర తక్కువ

రైతు సేవా కేంద్రాల ద్వారా బస్తా యూరియా ధర సుమారు రూ.267కు లభిస్తుంది. అదే బయట మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నారు. దాన్ని ఇంటికి తీసుకు రావడానికి మరికొంత ఖర్చు అవుతుంది. అదే నానో యూరియా 500 మి.లీ. బాటిల్ ధర మార్కెట్‌లో రూ.270. ఎకరాకు ఒకటిన్నర బస్తా సాంప్రదాయ యూరియా అవసరం అయితే నానో యూరియా 500 మి.లీ. బాటిల్ సరిపోతుంది. ప్రభుత్వం డీఏపీ బస్తా రూ.1350కి విక్రయిస్తుండగా బయటి మార్కెట్‌లో రూ.1450 నుంచి రూ.1500 వరకు పలుకుతోంది. అదే నానో డీఏపీ లీటరు ధర రూ.570కి అమ్ముతున్నారు. సాధారణ ఎరువులు అయితే బస్తాలను మోసుకెళ్లాలి. నానో ఎరువులైతే డబ్బాను ఎక్కడికైనా చేతిలో పట్టుకుని వెళ్లిపోవచ్చు. ఎకరాకు లీటరు ద్రావణం సరిపోతుంది. అదే ఎరువును ఒక్కసారి లేదా రెండుసార్లు పిచికారి చేస్తే చాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఇంకా ఏపీ ఎస్‌ఆర్‌ఏసీ, ఏపీఎస్ఎమ్‌డీసీ, ఏపీ గ్రౌండ్ వాటర్ బోర్డ్ వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు అర్హులన్నారు. సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో లెక్చరర్‌గా, సెంట్రల్ గవర్నమెంట్ ఓఎన్‌జీసీ, జీఏఐఎల్, సెయిల్, కోల్ ఇండియా లిమిటెడ్, బీపీఎల్, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8985597928, 9985442196 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అంతర్జాతీయ సదస్సుకు వైవీయూ ప్రొఫెసర్ జయరాజుకు ఆహ్వానం



ప్రొఫెసర్ జయరాజు (ఫైల్)

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలోని భూవిజ్ఞాశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్.జయరాజుకు యూకేలోని స్కాట్లాండ్ సెయింట్ ఆండ్రూస్ యూనివర్సిటీ నిర్వ హించనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈయన ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే సదస్సులో భారతదేశ తూర్పు తీరంలోని కొన్ని ప్రాంతాల నుంచి సముద్ర కాలుష్యాన్ని విశ్లేషించ డానికి మలస్కన్ షెల్స్ వినియోగం అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ప్రొఫెసర్ జయరాజు గతంలో 70 దేశాలలోని అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణ చేశారు. ప్రొఫెసర్ జయరాజుకు అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందడం పట్ల వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ అధ్యాపకులు ప్రొఫెసర్ రఘుబాబు, ప్రొఫెసర్ సునీత, సహాఆచార్యులు శ్రీనివాసగౌడ్ అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



సునీల్‌కుమార్ మృతదేహం

చాపాడు, ఆగస్టు 18: మండ లంలోని బద్రిపల్లి బస్టాప్ వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సునీల్‌కుమార్ (30) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కేతవరం గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ బైక్‌పై వెళ తుండగా లారీ వెనుక వైపు నుంచి ఢీ కొంది. దీంతో సునీల్‌కుమార్ రెండు కాళ్లు విరిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనంలో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ - స్కూటరు ఢీ... ఇరువురికి గాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న స్థానికులు

కమలాపురం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన మఠం చందు, ఖాజీపేట మండలం కొట్లూరుకు చెందిన నవీన్ కలిసి పని నిమిత్తం కమలాపురం నుంచి ఎర్రగుంట్లకు వెళతున్నారు. పందిళ్లపల్లె గ్రామ సమీపంలోకి రాగానే అదే దారిలో వెళుతున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఢీకొట్టారు. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. చందుకు రెండు కాళ్లు విరిగాయి. స్థానికులు 108లో కడప రిమ్స్‌కు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలిన మిద్దె... త్రుటిలో తప్పిన ప్రమాదం





పమాదం నుంచి బయటపడిన ఓబులమ్మ

మైదుకూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి దంతెల మిద్దె కూలింది. అదృష్టవశాత్తు ఇంట్లో నివశిస్తున్న మహిళకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా.. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పాతూరులో ఓబులమ్మ అనే మహిళ అద్దె ఇంట్లో నివసిస్తోంది. సోమవారం ఉదయం నిద్రలేచి ఇంటి పని అంతా చేసుకొని ఇంటి బయటకు రాగానే ఒక్కసారిగా ఇంటి పైకప్పు కుప్పకూలిపోయింది. దీంతో ఆమె ఎటువంటి ప్రమాదం లేకుండా బయట పడిందని స్థానికులు తెలిపారు. ఇంట్లోని సామాన్లు అన్ని మట్టి కుప్పలో కలిసిపోయి తీవ్రంగా నష్టపోయానని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ గడువు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డి-ఫార్మసీ పూర్తి చేసిన వారికి వందశాతం ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌జ్యోతి తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 19వ తేదీతో గడువు ముగియనుందని చెప్పారు. రేషన్ కార్డు, తక్కువ ఇన్‌కమ్ కలిగిన పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ చేసిన విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9440144057. 9981353745. 9885355377 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే పాలిటెక్నికల్ కళాశాల వెబ్‌సైట్‌లో కూడా సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు.

ఆకాంక్షల జిల్లా అభివృద్ధిలో అగ్రస్థానం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్,ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ఆకాంక్షల జిల్లాల అభివృద్ధిలో పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కంటే మన జిల్లా అగ్రస్థానంలో 73.8 స్కోర్‌తో ఉందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ఆకాంక్షల జిల్లాలలో జరుగుతున్న సామాజిక, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధే లక్ష్యంగా సాగుతు న్న ప్రక్రియలో మన జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఆకాంక్షల జిల్లా కార్యక్రమాలను సమర్థవంతగా అమలు చేయాలని ఆదేశించారు. ఆకాంక్ష జిల్లాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను నీతి అయోగ్ పర్యవేక్షిస్తోందన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతోందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో 89.6 స్కోర్‌తో 35వ ర్యాంకులో, విద్యలో 71 స్కోర్‌తో 100వ ర్యాంక్, వ్యవసాయంలో 62.9 స్కోర్‌తో 24 వ ర్యాంక్, ఆర్థికాభివృద్ధిలో 46.7 స్కోర్‌తో 71వ ర్యాంక్‌లో, మౌలిక సదుపాయాల్లో 81.7 స్కోర్‌తో 34వ ర్యాంకులో ఉన్నామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో వైద్యశాఖ విస్తృత సేవలందించాల న్నారు. ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, వైద్య శాఖలు సమష్టిగా పనిచేయా లన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, వ్యవసాయ అధికారి చంద్రానాయక్, ఉద్యానశాఖాధికారి రవిచంద్ర, సీపీవో హజరత్తయ్య, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై పరీక్షలు నిర్వహించాలి

జిల్లాలో మరింత మందికి సుఖవ్యాధులపై అవగాహన కల్పించి రక్త పరీక్షలు నిర్వహించేలా వైద్యశాఖ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం సభాభవనంలో ఎయిడ్స్ నిర్మూలనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్‌తోపాటు జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రవికుమార్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎన్‌జీవోలు, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో జిల్లాలో కళాశాలలు, పాఠశాలలు, లైన్ డిపార్ట్మెంట్స్ ప్రతి గ్రామానికి వెళ్లి హెచ్‌ఐవీ పరీక్ష, సుఖవ్యాధులపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. హెచ్‌ఐవీ అపోహలపై ర్యాలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో ఓబులమ్మ, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ అధికారులు పాల్గొన్నారు.

చియ్యపాడు ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కడప మారుతీనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండలం చియ్యపాడు గ్రామ హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయాలని ఎంఆర్‌పీఎస్, పీఆర్‌ఎస్‌వైఎఫ్, ఎస్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ పాఠశాల విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కర్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, కొన్నేపల్లి మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ, పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, ఎస్ఎంఎస్ చైర్మన్ సుబ్బరామాంజనేయులు మాట్లాడారు. మేజర్ పంచాయతీ అయిన చాపాడు గ్రామ దళితవాడలో దాదాపు 60 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠ శాల ఉందన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి పాఠ శాలలో చదువుకునే విద్యార్థులు 52 మంది వున్నారన్నారు. దీంతో ప్రభుత్వం ఆ పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేసే అవకాశం ఉన్నప్పటికీ... ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయడం సరికాదన్నారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కూడా చాలా తక్కువగా వుందన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి దళితవాడలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఏర్పాటు చేసి.. విద్యా భివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఆ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ అవకతవకలపై తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

మైదుకూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బద్వేల్, జమ్మలమడుగు మున్సిపాలిటీలలోని బిల్డింగ్‌లకు, స్థలాలకు సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్ అవకతవకలు జరిగాయి. దీనిపై సోమవారం మైదుకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌కు విజయవాడ నుంచి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిన్ట్రేషన్ అధికారి సంపత్‌కుమార్ విచ్చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలలోని అధికారులు ప్రాపర్టీ ట్యాక్స్ వేయడంలో అవకతకల జరిగినట్లు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. దీనిపై కడప జిల్లాలోని బద్వేలు, జమ్మలమడుగు మున్సిపాలిటీలలో థర్డు పార్టీతో ప్రాపర్టీ ట్యాక్స్‌లను సర్వే చేయించారు. ఆసర్వే నివేదికలపై మైదుకూరు మున్సిపాలిటీలో అధికారుల రివ్యూ మీటింగ్ పెట్టి రికార్డులను తనిఖీలు చేశారు. వారు ఇచ్చిన నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని సంపత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బద్వేల్ కమిషనర్ నరసింహారెడ్డి, జమ్మలమడుగు కమిషనర్ వెంకటరామిరెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

- రూ.9లక్షలు స్వాహా
- న్యాయం చేయాలంటూ వేడుకోలు

బద్వేలుటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నా పలుకుబడి పరపతిని ఉపయోగించి.. ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఓ కానిస్టేబుల్ తమ వద్ద నుంచి రూ.9లక్షలు తీసుకొని మోసం చేశాడని వెంకటరత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రాజుగారి వీధిలో తాము నివాసం ఉండేవాళ్లమన్నారు. అదే వీధిలో కాని స్టేబుల్ రవికుమార్ నివాసం ఉంటూ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండేవారన్నారు. తమతో బాగా సాన్నిహిత్యం కనపరుస్తూ, మీ కుమార్తె గురుదేవికి ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి 2023 సంవత్సరం నవంబరు 24వ తేదీ మా వద్ద రూ.6 ల క్షలు డబ్బులు తీసుకున్నాడని, రోజులు గడుస్తున్నా మా కూతురికి ఉద్యోగం ఇప్పించలేదన్నారు. అడిగితే మరో రూ.3లక్షలు ఇస్తేనే ఉద్యోగం వస్తుందని నమ్మబలికాడని, దీంతో మా వద్ద ఉన్న నగలను కుదవపెట్టి మరో రూ.3 ల క్షలు ఇచ్చామన్నారు. తీరా చూస్తే ఆ కంపెనీలో కసువు ఊడ్చే పనిలో పెట్టాడని, రూ.9లక్షలు డబ్బులు తీసుకొని ఈ పనిలో పెడతావా అని ప్రశ్నిస్తే మీ కూతురికి ఆ కంపెనీలో ఉద్యోగం లేదన్నారు. దీంతో మా డబ్బులు మాకు ఇవ్వమని అడిగితే మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోమని మమ్మలను బెదిరించాడని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీసు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా మాకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, మంత్రిని నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కోరుతున్నామన్నారు. ఈ విషయంపై అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులను వివరణ కోరగా, ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన రవికుమార్ అనే కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేశామని, ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉందని తెలిపారు.

దగ్గుబాటి సంకల్పం ఆదర్శనీయం



దగ్గుబాటి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కలకడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాను చదివిన పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకున్న లయన్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. దగ్గుబాటి కుటుంబసభ్యుల రూ.10.40 లక్షల ఆర్థిక సాయంతో బాటవారిపల్లె హైస్కూల్‌లో పూర్తయిన ప్రవేశమార్గం ఆర్చ్, గేట్, ఫెన్సింగ్‌లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కార్యసిద్ధిగా రాజీలేని మనస్తత్వం దగ్గుబాటి నైజమని కొనియాడారు. అందరికీ గుర్తుండిపోయేలా 2022వ సంవత్సరంలో ఇదే పాఠశాలలో రూ.6 లక్షలు ఖర్చు చేసి విద్యార్థులకు ఉపయోగపడేలా కళావేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఏటా మండలంలోని పాఠశాలల్లో టెన్త్ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. అనంతరం దగ్గుబాటి మాట్లాడుతూ బీపీ, షుగర్, ఇతర వ్యాధుల బారినపడిన పేద ప్రజలకు ఉచితంగా వైద్యం కల్పించాలన్నదే జీవిత లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కలకడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బరకం శ్రీనివాసులరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే దగ్గుబాటి వెంకటేశ్వరరావును హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో భానుమూర్తిరెడ్డి, రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్, రజనీకుమార్, అబ్బూరి తిరుపతినాయుడు, సుధాకర్‌నాయుడు, కాంతారావు, వైవీ రమణ, పునీత్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

సుండుపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె పర్యటనకు సోమవారం వచ్చిన కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ముఖ్యంగా సుండుపల్లె-రాయచోటి డబుల్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలని, అగ్రహారం నుండి సామిసేనిగడ్డ వరకు సుమారు 7 పల్లెలకు వెళ్లే రోడ్డు గుంతలమయమైందని జనసేన నాయకుడు రామాశ్రీనివాస్ తదితరులు వినతి పత్రం అందించారు. ఊటచెరువుకు కాలువలు ఏర్పాటు చేయాలని, మట్టికట్టకు మరమ్మతులు చేయాలని నీటి సంఘం అధ్యక్షుడు రామాంజులు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యవర్గ సభ్యుడు శివకుమార్ నాయుడు కోరారు. తోతాపురి బాధితులకు నష్టపరిహారం ఇంకా రాలేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గిరిజన సంఘ నాయకుడు అమృనాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల ఆఖరికి లేదా సెప్టెంబర్‌లో కిలోకు రూ.4 చొప్పున నష్టపరిహారం రైతులకు అందుతుందని తెలిపారు. మామిడి రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

టీబీ రహిత సమాజ నిర్మాణం జరగాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీబీ యూనిట్ వైద్యుడు శ్రీధర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజ నిర్మాణం జరగాలని, ఇందులో విద్యార్థుల పాత్ర ముఖ్యమని మదనపల్లె టీబీ యూనిట్ వైద్యుడు శ్రీధర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకుడు ప్రభాకర్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో టీబీ యూనిట్, మదనపల్లె, ఆర్ఆర్ఎస్ సంయుక్తంగా టీబీ వ్యాధి (క్షయ)పై అవగాహన కల్పించారు. విద్యార్థులు సరదా వినోదాలకు డబ్బు వృథా చేయకుండా ఒక టీబీ రోగికి పౌష్టిక ఆహారం అందిస్తే మంచిదని డాక్టర్ శ్రీధర్ సూచించారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఆర్ఆర్ఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పురు షోత్తం, అధ్యాపక బృందం, యూనిట్ సిబ్బంది శాంతి, వనజకుమారి, సుశీల, తరుణ్, సునీత, శ్వేత, జనార్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలి

● కజార్ప్ ల్యాబ్స్ సీఈఓ శ్రీకాంత్ కె అరిమనిత్య



కురబలకోట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని బెంగళూరు కజార్ప్ ల్యాబ్స్ సీఈఓ శ్రీకాంత్ కె అరిమనిత్య, చాన్సెలర్ ప్రొఫెసర్ నాదెళ్ల ద్వారకనాథ్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో మొదటి సంవత్సర ఇంజనీరింగ్ విద్యార్థుల ఓరియంటేషన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. విద్యార్థులు సాంకేతికపై దృష్టి సారించి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. పరిశ్రమలలో నూతన టెక్నాలజీలపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్‌ను సాధించవచ్చన్నారు. రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, ఏఐ మెదలైన టెక్నాలజీలపై పూర్తి స్థాయిలో నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా అధైర్యపడకుండా ముందుకు సాగి గమ్యస్థానాలను చేరుకోవాలన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని ఈ దశలో ఎటువంటి చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, తమ ఉజ్వల భవిష్యత్ మీద దృష్టిసారించి రాణించాలన్నారు. కళాశాలలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఇంటర్న్ షిప్‌లు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, కళాశాలకు పేరు తీసుకొచ్చి సమాజంలో అందరికీ ఆదర్శవంతంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వీసీ యువరాజ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రియా హ్యూమెనైడ్ రోబో

డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో మొదటి సంవత్సర ఇంజనీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో రియా హ్యూమెనైడ్ రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు రోబో చక్కటి సమాధానాలు ఇచ్చి అలరించింది. రోబో చెప్పిన సమాధానాలను విద్యార్థులు చక్కగా ఆలకించారు. అనంతరం రోబోతో ఫొటోలు దిగడానికి పలువురు ఎగబడ్డారు.

రెండు వర్గాలుగా రెడ్డి సంక్షేమ సంఘం

● వేర్వేరుగా నూతన కార్యవర్గాలు ఎంపిక


ఏర్పాటైన నూతన కార్యవర్గం

మదనపల్లె టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం రెండు వర్గాలుగా విడిపోయింది. సోమవారం రెడ్డెప్పనాయుడు కాలనీలో ఒక వర్గం, బెంగళూరురోడ్డు రెడ్డిసంక్షేమ సంఘం కార్యాలయం వద్ద మరో వర్గం సమావేశాలు నిర్వహించి వేర్వేరుగా నూతన కార్యవర్గాలను ఎంపిక చేసుకున్నారు. రెడ్డెప్పనాయుడు కాలనీలో ది మదనపల్లె రెడ్డిసంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాజీనామా చేసిన డాక్టర్ ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. అధ్యక్షుడుగా కనుగొండ మద్దిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంభం నాగభూషణరెడ్డి, కోశాధికారిగా డెయిరీ డే చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా దేవేంద్రారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ప్రసాదరెడ్డి, న్యాయ సలహాదారులుగా అవుల శివరామిరెడ్డి, మంజునాథరెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయం వద్ద మరో కార్యవర్గం సమావేశమై ఇంకో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా గుడిబండ రవికుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా వై.గిరిధర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా తట్టి శ్రీనివాసులురెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

పీలేరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సోమవారం జంగంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గంగాధర్ ఆధ్వర్యంలో బోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన గొప్ప యోధుడని ప్రశంసించారు. 11 సార్లు ఆంగ్లేయుల కారాగారంలో శిక్ష అనుభవించారని వివరించారు. ఉపాధ్యాయులు షరీఫ్, వై. లక్ష్మీదేవి, రామమూర్తి, ఎస్. రమణయ్య, ఏ. అశోక్ కుమార్, ఫారుక్, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ నష్టాన్ని నివారించండి

సబ్‌కలెక్టరేట్‌లో డీఏఓకు సీపీఐ నేతల వినతి ● సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

మదనపల్లె టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంత గేట్ల వసూళ్లకు రీటెండర్లు పిలిచి మున్సిపల్ ఆదాయాన్ని పెంచాలని సీపీఐ నేతలు టి.కృష్ణప్ప, మురళి, మాధవ్ డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా వారపు సంత టెండర్లు పిలవకపోవడంతో మున్సిపాలిటీకి రూ.40లక్షలు నష్టం వాటిల్లిందని వినతి పత్రంలో వారు వివరించారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో డీఏఓ నిర్మలాదేవికి వినతి పత్రం పలురకాల సమస్యలపై వినతులు సమర్పించారు. మదనపల్లె, ములకలచెరువు మండలాల్లో వందెకరాల దేవదాయ భూములు ప్రైవేటు వ్యక్తుల అధీనంలో వున్నాయని, వాటిపై ఆర్ఓఆర్ అప్పీల్‌కు అనుమతి ఇవ్వాలని అధికారులు బాల అంకన్న, రాజా డీఏఓకు వినతి పత్రం ఇచ్చారు. మదనపల్లె మండలం, పట్టణంలో కొందరు చౌకదుకాణ డీలర్లు సక్రమంగా దుకాణాలను నిర్వహించలేదని, గోదాము నుంచి డీలర్లకు తక్కువ తూకాల్లో బియ్యం సరఫరా చేస్తున్నారని, వీటిపై విచారించి ప్రజలకు న్యాయం చేయాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ వినతి పత్రం సమర్పించారు. అనంతపురం రూరల్ ఎమ్మెల్యే డి.వెంకటేశ్వర్లు ప్రసాద్‌పై టీడీపీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు టెంపర్ రాజేష్ కోరారు. తమ అభిమాన హీరోపై ఎమ్మెల్యే అవమానించే రీతిలో వాఖ్యలు చేశారని, వీటిని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఎమ్మెల్యే బహి రంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చే శారు. మొత్తం 76 మంది అర్జీలు అందజేశారు.


సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవికి వినతి పత్రం ఇస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నేతలు

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతుల నుంచి తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదులను స్వీకరించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కొత్తవారిపల్లెకు చెం దిన వెంకటరమణ భూ విషయమై ఫిర్యాదు చేశారు. రజక సంఘం సంబంధించిన ఇంటి పట్టాలను తహసీల్దార్ సర్వే చేసి చూపాలని రజక సంఘం నేతలు, మహిళలు అర్జీని తహసీల్దార్‌కు సమర్పించారు. డీటీ వెంకటస్వా మి, ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, సర్వేయర్ సుబ్ర హ్మణ్యం, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పరిష్కారంలో జాప్యం వద్దు

పీలేరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీపై విచారణ సత్వరం పరిష్కరించాలని పీలేరు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. మడల పరిషత్ కార్యాలయంలో పీజీఆ ర్ఎస్‌పై ఎంపీడీఓ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లా డుతూ అన్ని శాఖల అధికారులు పీజీఆర్ఎస్‌కు విధిగా హాజరు కాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించడం, శానిటేషన్, మంచినీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, అంటు రోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, విధిగా 15 రోజులకు ఒకసారి రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ తదితర కార్యక్రమాల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉపాధి పథకంలో భాగంగా కూలీలందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయం, ఐసీడీఎస్, విద్య, ప్రజారోగ్యంపై సమీక్షించారు. ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. డిప్యూటీ ఎడీపీ వై.వీ. రమణరావు, డీవైఈఓ లోకేశ్వర్ రెడ్డి, పలువురు అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

కలికిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజులు కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అశోక్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాల్లో సమాజానికి శాంతి, ఐశ్వర్యం, సౌభాగ్యం కోసం వివిధ రకాల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి రోజు పూర్వ కర్మలు, రెండో రోజు రెండు రోజుల యాగశాల పూజలు, చివరి రోజు పూర్వ కర్మలు, అనంత కర్మల గురించి ప్రత్యేక హోమాలు, భజనలు, పురాణ పారాయణాలు జరుగుతాయి. ఆలయానికి కొత్త శక్తిని ప్రసాదించేందుకు ఈ కుంభాభిషేకాలు దోహదపడతాయన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని కుంభాభిషేక కార్యక్రమాలను విజయవంతం చేయాలని అశోక్‌కుమార్ రెడ్డి కోరారు.

వినాయక ప్రతిమలకు అనుమతులు తప్పనిసరి



వాల్మీకిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా వినాయక ప్రతిమల ఏర్పాటుకు తప్పకుండా అనుమతులు తీసుకోవాలని సీఐ రాఘవరెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ చవితి ఉత్సవాలను ప్రశాంత వాతవరణంలో చేసుకోవాలని సూచించారు. ప్రతిమల ఏర్పాటుపై సంబంధిత ఉత్సవ కమిటీలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఉత్సవాలకు డీజే కార్యక్రమాలు, డాన్సులు, బాణసంచా కాల్చడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో ప్రతిమల ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతులు పొందాలన్నారు. ఉత్సవాలు ముగిసేదాకా సంబంధిత ఉత్సవ కమిటీ సభ్యులు ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా బాధ్యులవుతారన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు.

దళిత గ్రామాల్లో వసతులు కల్పించండి

ఎమ్మార్పీఎస్ పీలేరు ఇన్‌చార్జి వెంకటేశ్

పీలేరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దళిత గ్రామాల్లో వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ పీలేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేశ్ డిమాండ్ చేశారు. పీలేరు ఎంపీడీఓకు దళిత గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ దళిత గ్రామాల్లో కనీస వసతులకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీసీ రోడ్లు, మురుగు నీటి కాల్వలు, డ్రైన్లు అవసరం మేరకు లేకపోవడంతో వర్షాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పెన్షన్ల వెరిఫికేషన్‌లో అర్హులను అనర్హులుగా గుర్తించి పెన్షన్లు తొలగించడం అన్యాయమన్నారు. దళిత గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల్లో నెలకో సారైనా క్లోరినేషన్ చేయించాలన్నారు. క్లోరినేషన్‌కు నోచుకోక జనం రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు వెంకట్రమణ, శ్రీనివాసులు, యల్లక, లక్ష్మీదేవి, అంజమ్మ, రమణమ్మ, భూదేవి పాల్గొన్నారు.

'పీ4' పథకం పేదలపాలిట వరం


దగ్గుబాటిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కలకడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ4 పథకం పేదకుటుంబాలకు వరంలాంటిదని కదిరాయచెరువు సర్పంచ్ లక్ష్మీప్రసన్న కమలనాథ్ అన్నారు. గ్రామంలో 'పీ4' లబ్ధిదారులుగా గుర్తించిన పుష్పలత కుమారుడు పవన్‌కుమార్‌కు సోమవారం రూ.64 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బీటెక్ రెండో ఏడాది చదువుతున్న పవన్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులు కారణంగా మధ్యలో చదువు మానేసినట్లు తెలిసిందన్నారు. విద్యార్థి భవిష్యత్ దృష్ట్యా, గ్రామస్థులు రత్నమయ్య, శ్రీనివాసులు, వెంకటరత్నం ద్వారా నిధులు సమకూర్చి ఆ కుటుంబానికి అందజేసినట్లు చెప్పారు. కార్యదర్శి ఉదయ్‌కుమార్, విశ్వనాథశెట్టి, జోగేంద్ర, గోపాల్‌నాయుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ఆదరణతోనే మంచి పేరు

కలికిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైద్య సహాయం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది ఔదార్యం ప్రదర్శించాలని, వారి ప్రవర్తన మీదే ఆస్పత్రికి పేరొస్తుందని విశ్రాంత జిల్లా వైద్యాధికారి, కలికిరి సామాజిక ఆరో గ్య కేంద్రం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టి.వెంకట్రమణా రెడ్డి సూచిం చారు. ప్రభుత్వ ఆస్పత్రులకు సహజంగానే పేదవారు ఎక్కువగా వస్తారని వారిని ఆదరించి, ఉపశమనం కలిగించాల్సిన బాధ్యత ప్రధానంగా వైద్య సిబ్బందేనని ఆయన స్పష్టం చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో డాక్టర్ వెంకట్రమణా రెడ్డి సిబ్బందికి, వైద్యులకు పలు సూచనలు చేశారు. అత్యవసర చికిత్స కోసం వచ్చిన రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా దురుసుగా వ్యవహరించి వివాదాలకు కారణమైన సంఘటనలపై ఆయన ప్రస్తావించారు. అధునాతన ఖరీదైన భవనాలు, పరికరాలు, సిబ్బంది నియమాకాలు ఇవన్నీ కేవలం రోగుల కోసమేనని గుర్తించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ వై.పవన్‌కుమార్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్త భవనాల్లో ఓపీ సేవలు, వార్డుల ఏర్పాటు, మాతా శిశు వైద్య సేవలు, ఎక్స్‌రే, ల్యాబ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు, ఇంజెక్షన్లు, గుండె నొప్పి కోసం విలువైన ఇంజెక్షన్ అందుబాటులో వున్నాయన్నారు. సమావేశంలో వైద్యాధి కారి డాక్టర్ పవన్ కుమార్, ఇతర వైద్యులు ఉదయ్‌కిరణ్, ఆశాలత, శశికు మార్ రాజు, అన్వేష్, సిమ్రాన్, ఇంచార్జ్ హెడ్ నర్సు వనజ, రేడియోగ్రాఫర్ వెంకటరణ, ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ములకలచెరువు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉచిత బస్సు పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీ యూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు వాహన మిత్ర పథకం అమలు చేయాలన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్ వద్ద 20న జరిగే ధర్నాకు ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున హాజరవాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు మహబూబ్‌బాషా, ఖాదర్‌బాషా, రఫీ, మస్తాన్, శేఖర్, వేమన్న, నరసింహులు, రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన పాఠశాలను తెరిపించండి


ఎంపీడీఓ రమేష్‌తో మాట్లాడుతున్న సింగంవారిపల్లి గ్రామస్తులు

నిమ్మనపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సింగంవారిపల్లిలో వున్న ప్రభుత్వ ఉర్దూ పాఠశాలను తెరిపించాలని సోమవారం ఎంపీడీఓ రమేష్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గతంలో సింగంవారిపల్లిలో దాదాపు 35ఏళ్లగా ఉర్దూ పాఠశాల వుండేదని ఇక్కడ 5వరకు విద్యార్థులకు చదువు చెప్పేవారన్నారు. ప్రసుత్తం పాఠశాలలు విలీనం కావడంతో 2వతరగతి వరకు పాఠశాల నిర్వహించేవారని తెలిపారు. అయితే పాఠశాల ఉపాధ్యాయుడు బడికి పిల్లలు రాలేదని జీరో హాజరు చూపి ఆగస్టు నుంచి పాఠశాల మూతపడేలా చేశారన్నారు. దాదాపు 70కుటుంబాలున్న గ్రామంలో పాఠశాల మూతపడడంతో పక్కగ్రామానికి తమ పిల్లలు వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎంఈఓ-1 పద్మావతి మాట్లాడుతూ పాఠశాలకు పిల్లలు రాకపోవడంతోనే పాఠశాలను మూసివేశామని పిల్లలు పాఠశాలకు వస్తే కచ్చితంగా డీఈఓకు తెలిపి వెంటనే పాఠశాలను పునఃప్రారంభిస్తామని ఆమె తెలిపారు. గ్రామస్తులు రెడ్డిబాష, షాహీన, మున్నాఫ్, ఫయాజ్, అయూబ్‌ఖాన్, రఫి, అమీన్‌బీ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ


సొసైటీకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న సహకారశాఖ ఉద్యోగులు

మదనపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సహకారశాఖ ఉద్యోగులు సోమవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సొసైటీ కాలనీలోని సహకారశాఖ డివిజన్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమాచార కమిషన్ రూపొందించిన బ్యానర్‌తో ర్యాలీ కొనసాగింది. చట్టం ముఖ్య ఉద్దేశం. ప్రజలకు చట్టంతో కలిగే లాభాలు, ఎలా ఉపయోగించుకోవాలో సమావేశాల ద్వారా అవగాహన కల్పించారు. ఇందులో ప్రజలు, ఉద్యోగులు, సిబ్బంది కూడా ఈ చట్టంపై అవగాహనతో కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి, ఆశాఖ ఉద్యోగులు ఎ.ప్రవీణ్‌కుమార్, బి.దుర్గమ్మ, మోహీద్దీన్, సింగిల్‌విండో సీఈఓలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఆత్మీయ సన్మానం


కార్మికులను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ కోటేశ్వరి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. ఏసీటీసీ, ఏఆర్‌టీ, డీఎస్‌టీసీ, ఆర్ఎన్‌టీసీపీ ఉద్యోగుల ఆధ్వర్యంలో కార్మికులను సన్మానించారు. సూపరింటెండెంట్ కోటేశ్వరీ, ఆర్ఎంఓ డాక్టర్ సయ్యద్ సుకూర్ మాట్లాడుతూ అందరూ కలిసి మెలసి పని చేసేటప్పుడు ఆస్పత్రిలో అన్నిరంగాలు వృద్ధి చెందుతాయన్నారు. 15 మంది పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల, మైక్రోబయాలజీ ఇన్‌చార్జి శైలజా, డాక్టర్ హుమయూన్‌బాషా, ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, ప్రభాకర్, జయకుమార్, దీనదయాల్, భారత్, ప్రభాకర్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అంకాలమ్మ పాలకమండలి ప్రమాణస్వీకారం


ప్రమాణం చేస్తున్న అంకాలమ్మ ఆలయ పాలకమండలి సభ్యులు

పీలేరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత అయిన రౌద్రాల అంకాళమ్మ ఆలయ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా కె.రామకృష్ణారెడ్డి, సభ్యులుగా కె.శాంత కుమారి, ఎస్.నాగరత్నమ్మ, కె.చంద్రలేఖ, కె.అనసూయమ్మ, పి.మహాలక్ష్మీ, కె.రామయ్య, కె.వెంకటరమణ, ఎస్.హరీశ్ గుప్తా, జి.వెంకటరమణ, పిట్టా భాస్కరరెడ్డి, కృష్ణప్రసాద్ స్వామి ప్రమాణం చేశారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ ఈఓ టి.మం జుల అందరి చేత ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ ఆలయ అభివృద్ధి కోసం చిత్తశుద్ధి తో పనిచేసే వారినే సభ్యులుగా ఎంపిక చేశామని, ఆలయాన్ని అభివృద్ధి చేసి తమ నిబద్ధత చాటుకోవాలని సభ్యులకు సూచించారు. అంతకుమునుపు ఆయన నూతన పాలకమండలి సభ్యులతో కలిసి అంకాళమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశి, పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి, టీడీపీ నేతలు కోటపల్లె బాబురెడ్డి, లడ్డూ జాఫర్, అమరనాథరెడ్డి, లక్ష్మీకాంతమ్మ, షమ, స్పోర్ట్స్ మల్లి పాల్గొన్నారు.

వైభవంగా శనీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



వాల్మీకిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శనీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని నవగ్రహ మండపంలో ప్రత్యేకించి శనీశ్వరస్వామి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, విశేషాలంకరణలతో పూజలు జరిగాయి. శాంతి హోమాలు, శనిమహర్దశ తొలగింపుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన పోలీసు అధికారులు


సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పోలీసు అధికారులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణిని మదనపల్లె డివిజన్ పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో ఆమెను రూరల్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ శివకుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మదనపల్లె పట్టణం, రూరల్ పరిధిలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్య, సైబర్ నేరాల నియంత్రణ పలు అంశాలపై సబ్‌కలెక్టర్ పోలీసు అధికారులతో చర్చించారు.

పారిశుధ్యంపై చొరవచూపండి

గుర్రంకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చొరవచూపాలని ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో పల్లెలో పారిశుధ్యం లోపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురికి కాల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు రోగాలభారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలను పాటించాలని చెప్పారు. కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆవులకు గాయాలు



రామసముద్రం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అంజనేయస్వామి కాలనీలో వీధి కుక్కల దాడిలో ఐదు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆవులకు పశువైద్యశాలలో చికిత్స అందించారు. కాలనీలో పలువురి ఆవులు, గొర్రెలు, కోళ్లపై సోమవారం వీధికుక్కలు దాడి చేసి గాయపరిచాయని గ్రామస్తులు తెలిపారు. కుక్కల బెడద నుంచి రక్షించాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు మండల సమావేశం

కలికిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ అహ్మద్ రియాజుద్దీన్ తెలిపారు. ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. మండల స్థాయి అధికారులందరూ ఆయా శాఖల పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.